# నేటి సాక్షి


తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

27.03.2026 శుక్రవారం Friday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 246 | పేజీలు : 11 Pages : 11 | వెల రూ.2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









3

## ఆరోగ్యశ్రీపై అసత్యాలు

- మైక్ కట్ చేసి గొంతు నొక్కే ప్రయత్నం..
- ఖర్చుల పెంపు సహజం.. ఘనతేమీ లేదు
- మాజీ మంత్రి.. ఎమ్మెల్యే హరీష్ రావు
- ఆసుపత్రుల నిర్మాణంలో జాప్యంపై విమర్శ



4

## నేడు సీఎంలతో ప్రధాని 'వార్' మీటింగ్!

చమురు సంక్షోభంపై అత్యవసర సమీక్ష

# రాష్ట్రంలో ఇంధన కొరత లేదు

**ఆందోళనకు గురి కావద్దు**


**పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**



02

*రాష్ట్రంలో ఇంధన నిల్వలు ఉన్నాయని.. దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రజలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. బుధవారం 2,123 ట్యాంకర్స్ పెట్రోల్ సరఫరా చేశామన్నారు. యావరేజ్‌గా 5,883 లీటర్ల పెట్రోల్ వినియోగం ఉంటే.. బుధవారం ఒక్క రోజే 84 శాతం అధికంగా పెట్రోల్ సరఫరా చేశారని చెప్పారు.*


### నేటి నుంచి మూడ్రోజులు బ్యాంకులకు సెలవులు




02

### వినియోగదారులకు నయారా షాక్

పెట్రో, డీజిల్ ధరలు పెంపు



.. వివరాలు 2లో



# ప్రపంచ దేశాలకు భారీ ఊరట

- తెరుచుకున్న 'హర్మూజ్' జలసంధి!
- భారత్ సహా మిత్ర దేశాల సరుకు రవాణాకు ఇరాన్ గ్రీన్ సిగ్నల్
- రంగంలోకి దిగిన ఐక్యరాజ్యసమితి..
- చమురు, గ్యాస్ రవాణా కష్టాలకు చెక్
- ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ అధికారిక ప్రకటన



4

## అమెరికాను ఎదుర్కొనేలా ఇరాన్ ఎత్తులు

- ఖర్గ్ ఐలాండ్‌లో భారీగా మందుపాతరలు

# గత ప్రభుత్వబకాయిలు కడుతున్నాం

**ఆరోగ్యశ్రీ కింద 600 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారు**

- ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించాం
- విద్య, వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం
- సీఎంఆర్ఎఫ్ నిధులను దుర్వినియోగం చేశారు
- అన్ని బాగోతాలు బయటపెట్టబోతున్నాం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాసు పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పకొచ్చారు.

**హైదరాబాద్, మార్చి 26:** 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని సీఎం రేవంత్ వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియో గం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని మరోసారి తేల్చి చెప్పారు.

మిగతా 2 లో

# 13మంది సజీవ దహనం

## మార్కాపురం వద్ద ఘోర ప్రమాదం

- టిప్పర్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్
- క్షణాల్లో వ్యాపించిన మంటలు
- జగిత్యాల నుంచి కనిగిరి వెళ్తుండగా తెల్లవారుజామున విషాదం
- 28 మందికి తీవ్ర గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం
- ప్రధాని మోదీ, సీఎంలు, మంత్రుల తీవ్ర దిగ్భ్రాంతి

02



"మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలోని పలకల క్వారీల వద్ద గురువారం తెల్లవారుజామున గుండెలు పిండేసే విషాదం చోటుచేసుకుంది. హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ భీకర ప్రమాదంలో బస్సులోని 13 మంది ప్రయాణికులు బయటకు రాలేక లోపలే సజీవ దహనమయ్యారు. ప్రమాద సమయంలో బస్సులో మెత్తం 41 మంది ప్రయాణికులు ఉన్నారు."

**మార్కాపురం, మార్చి 26 (ఉద్యమ కెరటం):** మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సుతో పాటు టిప్పర్‌లోనూ మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 13 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. వారి మృతదేహాలను వెలికితీశారు. మరో 28 మందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంతో బస్సు, టిప్పర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. బస్సును హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించారు. గురువారం తెల్లవారు జామున ఆరుగంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. ఘటనాస్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మిగతా 2 లో

# పద్దులపై చర్చలకు బదులు గొప్పలా?

- మిషన్ భగీరథ పేరుతో డబ్బు దుబారా
- దీనిపై ఎక్కడికైనా వెళ్లి పరిశీలిద్దామా
- సభలో బీఆర్ఎస్ సభ్యుల తీరుపై మండిపడ్డ భట్టి



# గత ప్రభుత్వం బకాయిలు కడుతున్నాం

మొదటి పేజీ తరువాయి

27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకు వస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.విద్య, పేదల వైద్యం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వైద్యానికి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.2,046 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని చెప్పారు. గతంలో ఈ చెక్కుల విషయంలో అవినీతి జరిగిందన్నారు. 27 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామన్నారు. టీచింగ్ కాలేజీలకు రోగులు వెళ్లడం లేదని సీఎం అన్నారు. ఈ కాలేజీల నిర్వహణను గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకొచ్చామని వివరించారు. విదేశాల్లో నిపుణులైన వైద్యుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు. ఆ పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్నారు.





## కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి ఫండ్స్ పెరగాలి

తెలంగాణలో కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి సీఎస్ఆర్ ఫండ్స్ వేరే చోట ఖర్చు పెడతానంటే ఎలా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటి వరకు వచ్చిన సీఎస్ ఆర్ ఫండ్స్ మెరుగు గా లేవని అన్నారు. రాష్ట్రానికి మరిన్ని సీఎస్ఆర్ ఫండ్స్ రావాల్సిన అవసరం ఉందన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ మరిన్ని తెలంగాణ లో ఖర్చు పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సీఎస్ ఆర్ ఫండ్స్ ఎక్కువ ఖర్చు చేసిన వారిని గుర్తించి ప్రభుత్వం తరపున సత్కరించాలన్నారు. సీఎస్ ఆర్ ఫండ్స్ కోసం వెబ్సైట్ ఏర్పాటు చేయాలి..సీఎస్ఆర్ ఫండ్స్ ను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి..ఇతర రాష్ట్రాల్లో సీఎస్ఆర్ ఫండ్స్ కోసం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న సంస్థలు కనీసం 50 శాతం సీఎస్ఆర్ ఫండ్స్ కచ్చితం గా ఇక్కడే ఖర్చు పెట్టాలని, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్, సి ఎం ఓ ముఖ్యకార్యదర్శి శేషాద్రి,సిఎంఓ ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి,సిఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్ ,ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ప్రయాణికులకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సేవలు

**స్వీయ ఆదాయ వనరులు పెంచుకోవాలి**

**స్టేషన్ల వద్దకు ఆర్టీసీ సర్వీసులు పొడిగించాలి**

**ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, మార్చి 26:** హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్‌లో ఏటికేడు ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమంతప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉన్నందున అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని సీఎం తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు.. వసతులు మెరుగుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఆర్ అండ్ బీ వికాస్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హెచ్‌యూఎంటీఏ ఎండీ జీవన్ బాబు, దక్షిణ మధ్య రైల్వే డీసీఎం చరణ్ నాయక్ పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కనిగిరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో బస్సు వెనుక భాగంలో ఉన్నవారు బయటకు రాలేక మృతిచెందినట్లు తెలుస్తోంది. ముందు భాగంలో ఉన్నవారు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుల్లో కనిగిరి, వింజమూరు, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలాన్ని మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. మృతుల వివరాలు.. సీహెచ్ మనోజ్‌కుమార్ (18), వింజమూరు, సీహెచ్ సుజాత (45), వింజమూరు, సీహెచ్ మేఘన (19), వింజమూరు, టి. నరేంద్ర (25), నల్లగొండ్ల, టి. చందన (21), నల్లగొండ్ల, టి. చందు (6), నల్లగొండ్ల , కె. ప్రకాశ్ (17), అయ్యవారిపల్లె, కె.అయ్యన్న (18), (ఎర్రబొట్లపల్లె) వి. గురవయ్య (60), చింతగుంట్ల, కె.అబ్రహం (42), చోడవరం, పి.మహేంద్రరెడ్డి (17), చోడవరం రామచంద్ర ప్రవీణ్ (21), చోడవరం, ఎ.సౌజన్య (22), పెదారికట్ల ఉన్నారు. ఈ ప్రమాదంపై సీఎం చంద్రబాబు,ప్రధాని మోడీ, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలోనినిర్మల్ నుంచి నెల్లూరుకు ఈ బస్సు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. బస్సు ప్రమాదంపై మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

# ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి

**మృతుల కుటుంబాలకు 2లక్షలు, క్షతగాత్రులకు 5వేల పరిహారం**

**న్యూఢిల్లీ, మార్చి 26:** ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం సమీపంలో జరిగిన ప్రమాదం అత్యంత విషాదకరమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 ఎక్స్‌గ్రేషియా పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి అందిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ మేరకు పీఎంఓ కార్యాలయం ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ప్రమాదంపై స్పందిస్తూ, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# నేటి నుంచి మూడ్రోజులు బ్యాంకులకు సెలవులు

**హైదరాబాద్,మార్చి26:** బ్యాంకులకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు రాబోతున్నాయి . శుక్రవారం, శనివారం, ఆదివారాల్లో బ్యాంకులు పని చేయవు. శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం సెలవు. అలాగే నాలుగో శనివారం, ఆదివారాల్లో బ్యాంకులు తెరుచుకోవు. దీంతో సోమవారమే బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయి. చెక్ క్లియరెన్స్‌లు, డాక్యుమెంట్ సబ్మిషన్, ఇతర వ్యక్తిగత సేవల కోసం బ్యాంకులకు వెళ్లాలనుకుంటే సోమవారం వరకు ఆగాల్సిందే.

# పద్దులపై చర్చలకు బదులు గొప్పలా?

- **మిషన్ భగీరథ పేరుతో డబ్బు దుబారా**
- **దీనిపై ఎక్కడికైనా వెళ్లి పరిశీలిద్దామా**
- **సభలో బిఆర్ఎస్ సభ్యుల తీరుపై మండిపడ్డ భట్టి**

**హైదరాబాద్, మార్చి 26:** బీఆర్ఎస్ శాసనసభ్యులు పద్దులపై చర్చను పక్కనపెట్టి, గత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలన గురించి గొప్పలు చెప్పుకోవడమే లక్ష్యంగా మాట్లాడుతున్నారని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చురకలంటించారు.. ప్రజా సమస్యలపై చర్చించాల్సింది పోయి గత ప్రభుత్వం గొప్పలు చేసిందని చెప్పడానికి ప్రాధాన్యం ఇవ్వడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో మహిళా శిశు సంక్షేమం పంచాయతీరాజ్ పద్దులపై జరుగుతున్న చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. పెళ్లయి బిడ్డ సంకలోకి వచ్చినా కల్యాణ లక్ష్మి చెక్కు అందలేదు' అని ఎమ్మెల్యే సునీత చేసిన వ్యాఖ్యలు వాస్తవమైతే, ఆ ఆలస్యానికి గల కారణాలను ప్రభుత్వం ఖచ్చితంగా పరిశీలిస్తుందన్నారు. సాధారణంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి జాప్యం జరగడం లేదు. ఒకవేళ ఎక్కడైనా ఆలస్యం జరిగితే అది ఎమ్మెల్యే సంతకం లేకపోవడం వల్లో, దరఖాస్తు చేయడంలో జాప్యం వల్లో లేదా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లో జరిగి ఉండవచ్చు. దీనిపై పూర్తి వివరాలను సభ ముందు ఉంచుతాం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రజలకు నీళ్లు ఇవ్వడం కోసం తెచ్చిందా? లేక పైపుల కంపెనీల ప్రయోజనం కోసం తెచ్చిందా అని అన్నారు. ఈ పథకం కోసం దాదాపు రూ. 40 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, లక్షా 23 వేల కిలోమీటర్ల మేర పైపులు వేశామని లెక్కలు చెప్పారు. కానీ ఎక్కడో దూరం నుంచి నీళ్లు తెచ్చి, ఫిల్టర్ చేసి పంపిణీ చేసే విధానం క్షేత్రస్థాయిలో ఎక్కడా సక్రమంగా అమలు కాలేదన్నారు. తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా మిషన్ భగీరథ సక్రమంగా పనిచేయడం లేదు. ఎక్కడ చూసినా పైపుల లీకేజీలు, పగిలిన పైపులతో నీరు వృథా అవుతోంది కానీ ప్రజలకు మాత్రం అందడం లేదన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల నుంచి ఎర్రుపాలెం వరకు వేసిన పైప్‌లైన్ ద్వారా సరిగ్గా నీరు అందిన పరిస్థితి లేదు. కేవలం లీకేజీలు, మరమ్మతులతోనే కాలం గడుస్తోంది. కొత్త పథకం పేరుతో స్థానిక నీటి వనరులను నిర్లక్ష్యం చేయడమే కాకుండా, అప్పటికే పనిచేస్తున్న పాత నీటి పథకాలకు తాళాలు వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. మిషన్ భగీరథ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమైతే ఒక కమిటీ వేద్దాం. ఊరూరా తిరిగి నీటి పంపిణీ ఎలా జరుగుతుందో, క్షేత్రస్థాయి వాస్తవాలు ఏంటో ప్రత్యక్షంగా పరిశీలిద్దాం అన్నారు. ప్రతిపక్ష నేతలు సభను, ముఖ్యమంత్రిని మరియు మంత్రులను గౌరవించి మాట్లాడాలి. సభా మర్యాదలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరం అని గుర్తు చేశారు.



# ఇంధన కొరత లేదు

**ప్రజలు ఆందోళనకు గురి కావద్దు**

**పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**

**హైదరాబాద్, మార్చి 26:** రాష్ట్రంలో ఇంధన నిల్వలు ఉన్నాయని.. దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రజలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. బుధవారం 2,123 ట్యాంకర్స్ పెట్రోల్ సరఫరా చేశామన్నారు. అలాగే 10,799 లీటర్లు సరఫరా చేశారని వివరించారు. యావరేజ్‌గా 5,883 లీటర్ల పెట్రోల్ వినియోగం ఉంటే.. బుధవారం ఒక్క రోజే 84 శాతం అధికంగా పెట్రోల్ సరఫరా చేశారని చెప్పారు. 22,127 కిలో లీటర్ల డీజిల్ ఆయిల్ కంపెనీలు సరఫరా చేశాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ 596 అవుట్ లెట్స్ ఉన్నాయని అన్నారు. ప్రతీ బంక్‌లో పౌరసరఫర, సివిల్ సప్లై, రెవెన్యూ, పోలీస్, లీగల్ మెట్రాలజీ అధికారుల బృందం పరిశీలన చేస్తుందని తెలిపారు. బుధవారం కంటే.. గురువారం పెట్రోల్ బంకుల వద్ద రద్దీ తగ్గిందన్నారు. రాష్ట్రంలో గృహ వినియోగంలో 1,28,24,087 ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయని.. ప్రతీ రోజు 2,20,000 గ్యాస్ బుకింగ్స్ జరుగుతున్నాయని పేర్కొన్నారు. బుధవారం ఒక్క రోజే 2,19,980 సిలిండర్లు సరఫరా చేశామన్నారు. వినియోగదారులు అధికంగా బుకింగ్స్ చేయడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడుతుందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు. అలాగే 1,03,275 పైప్ న్యాచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. 2,78,418 క్యూబిక్ మీటర్లు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కేంద్రం ఆదేశాల మేరకు పీఎన్జీ, సీఎన్జీని విస్తరించాల్సి ఉందని చెప్పారు. 24 గంటల్లో ప్లాంట్లకు అనుమతి ఇవ్వడంతో పాటు పలు రాయితీలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు.

# దావోస్ పెట్టుబడులపై 'శ్వేతపత్రం' సిద్ధం

- **రాష్ట్రానికి రూ. 2.19 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు**
- **విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, మార్చి 26:** దావోస్ పర్యటనలో కుదుర్చుకున్న పెట్టుబడులు.. ఒప్పందాలపై శాసనసభలో విపక్ష సభ్యులు చేసిన విమర్శలను మంత్రి శ్రీధర్ బాబు ఘాటుగా తిప్పికొట్టారు. ఈ పర్యటనల ద్వారా తెలంగాణకు మొత్తం 2.19 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. ప్రభుత్వం మొత్తం 44 ఎంఓయూలు కుదుర్చుకుందని.. ఈ ఒప్పందాల అన్నింటిపై శ్వేతపత్రం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.



## వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు

ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 68,150 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి వివరించారు. కేవలం 2024 దావోస్ పర్యటనలోనే 18 ఒప్పందాలు జరిగాయని.. వాటి ద్వారా 40,232 కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని తెలియజేశారు. పరిశ్రమల ఏర్పాటు వల్ల రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలతో పాటు స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి దొరుకుతుందని ధీమా వ్యక్తం చేశారు. సుమారు 81,800 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టే ఆరు కంపెనీలకు ఇప్పటికే భూముల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని శ్రీధర్ బాబు వెల్లడించారు. దీని ద్వారా ప్రభుత్వానికి 1,540 కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. మరో మూడు కంపెనీలు 30 వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని.. వాటికి అవసరమైన భూములను గుర్తించే పనులు జరుగుతున్నాయని వివరించారు.

## నిజామాబాద్ ఐటీ టవర్ పురోగతి

నిజామాబాద్ ఐటీ టవర్ కార్యకలాపాలపై కూడా మంత్రి సభలో స్పష్టతనిచ్చారు. అక్కడ ప్రస్తుతం 11 కంపెనీలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. మొత్తం 681 సీట్ల సామర్థ్యంతో నిర్మించిన ఈ టవర్‌లో ప్రస్తుతం 276 మంది ఉద్యోగులు విధుల్లో ఉన్నారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నగరాల్లో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# వినియోగదారులకు నయారా షాక్

**న్యూఢిల్లీ, మార్చి 26:** ప్రైవేటురంగ చమురు సంస్థ నయారా ఎనర్జీ వినియోగదారులకు షాకిచ్చింది. లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచింది. పెరిగిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఆయా రాష్ట్రాలు విధించే వ్యాట్ ఆధారంగా ఈ పెంపు వర్తిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ పెంపు గరిష్ఠంగా రూ.5.30 వరకు ఉంటుంది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా పెట్రోల్ పంపులు ఉండగా.. రష్యా చమురు సంస్థ అయిన రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీ 6,967 పెట్రోల్ పంపులను ఆపరేట్ చేస్తోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను సవరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరో ప్రముఖ ప్రైవేటురంగ చమురు సంస్థ రిలయన్స్-బీపీ మాత్రం పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. దేశవ్యాప్తంగా 2,185 ఔట్‌లెట్లను జియో-బీపీ నిర్వహిస్తోంది. సుమారు 90 శాతం మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వరంగ చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ మాత్రం సాధారణ పెట్రోల్, డీజల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. ప్రీమియం పెట్రోల్ ధరను మాత్రం రూ.2.30 మేరకు ఇటీవల సవరించాయి. ఇండస్ట్రియల్ డీజిల్‌ను లీటరుకు రూ.22 చొప్పున పెంచాయి.

# ఎంఎంటీఎస్‌కు మహర్దశ..

- సర్వీసులు పెంచాలని సీఎం ఆదేశం!
- కార్యాలయ సమయాల్లో రైళ్ల సంఖ్య పెంపు.. సమయపాలన తప్పనిసరి
- స్టేషన్లకు మినీ బస్సులు.. ప్రయాణికులకు మెరుగైన వసతులు



**హైదరాబాద్, మార్చి 26:** హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనమండలి హాల్‌లో ఎంఎంటీఎస్ సేవలపై గురువారం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్యను పెంచడంతో పాటు.. ఖచ్చితమైన సమయ పాలన పాటిస్తూ సర్వీసులను నడపాలని అధికారులను ఆదేశించారు. నగరవాసులకు ప్రయాణం సులభతరం చేసేలా రైల్వే వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణికుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టడంపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఎంఎంటీఎస్ స్టేషన్లు లోపలికి ఉండటం.. అక్కడికి ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు వీలు లేకపోవడమే ప్రధాన అడ్డంకిగా గుర్తించారు. ఈ సమస్యను అధిగమించేందుకు స్టేషన్ల వరకు రాకపోకలు సాగించేలా ప్రత్యేకంగా మినీ బస్సులను నడిపే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని రకాల వసతులను కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నాణ్యమైన సౌకర్యాలు ఉన్నప్పుడే ప్రజలు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని అభిప్రాయపడ్డారు. రైల్వే శాఖ తన స్వయం ఆదాయ వనరులను పెంచుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీని పెంచడం.. ప్రయాణికుల సంఖ్యను పెంచడానికి ఉన్న అవకాశాలపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కీలక సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు.. ప్రభుత్వ ఉన్నతాధికారులు.. దక్షిణ మధ్య రైల్వే అధికారులు పాల్గొన్నారు. నగర రవాణా వ్యవస్థలో ఎంఎంటీఎస్ పాత్రను మరింత క్రియాశీలం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వీరు సుదీర్ఘంగా చర్చించారు.

# గద్దర్ సతీమణి విమలకు డిప్యూటీ సీఎం పరామర్శ

నిమ్స్‌లో అందుతున్న వైద్యంపై ఆరా

మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పరామర్శ

మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు ఆదేశం



**హైదరాబాద్, మార్చి 26:** దివంగత ప్రజా గాయకుడు గద్దర్ సతీమణి విమల గాల్ బ్లాడర్ సమస్యతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి గురువారం ఆసుపత్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న విమలను పరామర్శించి ఆమెకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విమలమ్మకు అందుతున్న వైద్య సేవలపై నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్చించారు. గాల్ బ్లాడర్ సమస్య తీవ్రత.. ప్రస్తుతం అందిస్తున్న చికిత్స వివరాలను ఆరా తీశారు. ప్రభుత్వం తరపున ఆమెకు అత్యుత్తమ వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విమలమ్మ త్వరగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు.. ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీపై అసత్యాలు

మైక్ కట్ చేసి గొంతు నొక్కే ప్రయత్నం..

ఖర్చుల పెంపు సహజం.. ఘనతేమీ లేదు : హరీష్ రావు

ఆసుపత్రుల నిర్మాణంలో జాప్యంపై విమర్శలు



**హైదరాబాద్, మార్చి 26:** రాష్ట్రంలో ఆరోగ్య రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను మాజీ మంత్రి.. ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. అసెంబ్లీలో వాస్తవాలు చెప్పనీయకుండా ప్రభుత్వం తన మైక్ కట్ చేసిందని మండిపడ్డారు. ప్రజలకు నిజాలు తెలియకుండా అడ్డుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ ఖర్చులపై ప్రభుత్వం చెబుతున్న లెక్కల్లో కొత్తదనం లేదని హరీష్ రావు విమర్శించారు. 2014 జూన్ 2 నాటికి ఆరోగ్యశ్రీ కోసం నెలకు 32 కోట్ల రూపాయలు ఖర్చయ్యేవని.. 2023 నాటికి అది 68 కోట్లకు చేరిందని గుర్తు చేశారు. జనాభా పెరుగుదల.. వైద్య ఖర్చుల పెరుగుదల వల్ల ఇప్పుడు ఆ మొత్తం పెరగడం సహజమని పేర్కొన్నారు. ఇందులో కాంగ్రెస్ సాధించిన ఘనత ఏమీ లేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో మొదలైన ఆసుపత్రుల నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు అండగా ఉండేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్సైజ్ ఆదాయం నుంచి వాటా పెంచిందని హరీష్ రావు వివరించారు. ఆసుపత్రుల పనులు పూర్తి చేసి ఉంటే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేవని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉంటే ఆ ఆసుపత్రులన్నీ పూర్తయ్యేవని స్పష్టం చేశారు.

# ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి

సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు.. అంతా ఒకే గొడుగు కిందకు

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మార్చి 26 :** తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ (ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్)ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్/రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్– డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్?వసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నాకూడా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు. ఒక క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు.

# హార్వర్డ్ ఏఐ సదస్సులో సీఎం రేవంత్ కీలక ప్రసంగం!

- హార్వర్డ్ కెన్నడీ స్కూల్‌లో కృత్రిమ మేధపై తొలి సింపోజియం
- బడ్జెట్ సమావేశాల దృష్ట్యా వర్చువల్‌గా హాజరుకానున్న ముఖ్యమంత్రి
- ప్రపంచ స్థాయి నిపుణులతో కలిసి ఏఐ భవిష్యత్తుపై చర్చ

**హైదరాబాద్, మార్చి 26:** అమెరికాలోని ప్రతిష్టాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెచ్ కే ఎస్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ విభాగం తొలిసారిగా నిర్వహిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) సింపోజియంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. మార్చి 27న (శుక్రవారం) జరిగే ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రభుత్వ.. పరిశ్రమ.. విద్యా రంగాలకు చెందిన ప్రముఖులు ప్రపంచవ్యాప్తంగా మారుతున్న ఏఐ పరిస్థితులపై చర్చించనున్నారు. హార్వర్డ్ పూర్వ విద్యార్థి అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈ సదస్సులో కీనోట్ ప్రసంగం చేయాల్సిందిగా యాజమాన్యం ఆహ్వానించింది.



## వర్చువల్‌గా ప్రసంగం

ప్రస్తుతం తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని బోస్టన్ నగరానికి వెళ్లడం లేదు. దీనికి బదులుగా ప్రత్యేక ఏర్పాటు ద్వారా ఇక్కడి నుంచే వర్చువల్ పద్ధతిలో ఆయన ప్రసంగించనున్నారు. హార్వర్డ్ కెన్నడీ స్కూల్ ఫ్యాకల్టీ డీన్ జెరెమీ వీన్ స్టెయిన్ ప్రారంభోపన్యాసంతో ఈ సదస్సు మొదలవుతుంది. బిజినెస్ అండ్ గవర్నమెంట్ పీఐసీ.. ఏఐ అండ్ టెక్ పాలసీ కాకస్ వంటి ప్రముఖ సంస్థల సహకారంతో హార్వర్డ్ క్యాంపస్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## ఏఐ భవిష్యత్తుపై లోతైన చర్చ

ఈ సదస్సులో పాలన.. ఆర్థిక పోటీతత్వం.. భౌగోళిక రాజకీయాలు.. మానవ వనరులపై కృత్రిమ మేధ ప్రభావం వంటి కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. వీటితో పాటు ఏజీఐ దిశగా పరుగు.. వర్ధమాన దేశాల్లో ఏఐ.. కంప్యూట్ భౌగోళిక రాజకీయాలు.. విద్య.. ఉపాధి భవిష్యత్తు వంటి అంశాలపై ప్యానల్ చర్చలు నిర్వహించనున్నారు.

## ప్రపంచ స్థాయి నిపుణుల భాగస్వామ్యం

ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన మేధావులు పాల్గొంటున్నారు. ఎక్స్ ప్రైజ్ సీఈఓ అనూషే అన్సారీ.. ప్రపంచ బ్యాంకు ప్రతినిధి ఇల్లంగో పచ్చముత్తు.. హార్వర్డ్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ కు చెందిన ఫాతిమా సుమార్.. బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్‌కు చెందిన లాండ్రీ సిగ్నే వంటి ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ప్రపంచం గర్వించదగ్గ మేధావుల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

# భద్రాచలానికి మహర్దశ..

586 కోట్లతో రామాలయ అభివృద్ధి!

తొలి దశలో 351 కోట్లతో పనుల ప్రారంభం

నేడు సీతారాముల కల్యాణానికి సీఎం రేవంత్ రెడ్డి రాక

ముత్యాల తలంబ్రాలు.. పట్టువస్త్రాల సమర్పణ

ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాచలం, మార్చి 26 :** శ్రీరాముడు నడయాడిన భద్రాచల పుణ్యక్షేత్రం అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీగా నిధులు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొత్తం 586 కోట్ల రూపాయలతో రామాలయంతో పాటు భద్రాచలం పట్టణాన్ని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి దశలో 351 కోట్ల రూపాయలతో చేపట్టే పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా శంకుస్థాపన చేస్తారని వివరించారు. శుక్రవారం శ్రీరామనవమి పురస్కరించుకుని భద్రాచలంలోని మిథిలా కళ్యాణ మండపంలో జరిగే స్వామివారి కల్యాణ వేడుకల ఏర్పాట్లను మంత్రి గురువారం పరిశీలించారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

సీతారామచంద్రస్వామి దంపతులకు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు.. పట్టువస్త్రాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్పించనున్నారని మంత్రి తుమ్మల తెలిపారు. ఇందుకోసం శుక్రవారం భద్రాచలానికి వస్తున్న ముఖ్యమంత్రికి ప్రజల తరఫున ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారులు.. రైల్వే కనెక్టివిటీ.. ఎయిర్‌పోర్టు ఏర్పాటు దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయని పేర్కొన్నారు.

## వచ్చే ఏడాది పుష్కరాల ఏర్పాట్లు

పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరిలో నావిగేషన్ సిస్టమ్ ఏర్పాటుకు అవకాశం ఉందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. కల్యాణం వీక్షించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. ఏర్పాట్లపై దేవాలయ అధికారులు.. సిబ్బందికి మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.



# శాసనసభ్యులకు క్రీడా పోటీలు

28 29 తేదీల్లో రెండ్రోజుల పాటు నిర్వహణ

మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి వెల్లడి

**హైదరాబాద్, మార్చి 26:** రాష్ట్రంలో విద్యార్థులు యువకులు అన్ని వర్గాలకు క్రీడల ప్రాముఖ్యత తెలియజేసే విధంగా శాసన సభ్యుల క్రీడోత్సవాలు నిర్వహించబోతున్నామని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి లు తెలిపారు. ఈనెల 28 29 తేదీల్లో జరగబోయే శాసనసభ్యులు శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 నిర్వహణ సన్నాహక సమావేశం అసెంబ్లీలోని కమిటీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనునిత్యం రాజకీయాల్లో బిజీ ఉండే శాసన సభ్యులు శాసనమండలి సభ్యులకు ఈ క్రీడా పోటీలు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని క్రీడల పట్ల అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పోటీలు మొట్టమొదటి సారిగా నిర్వహించబోతున్నామని, పార్టీలబేధ భావాలు పక్కనపెట్టి శాసనసభ్యులు అందరూ ఈ క్రీడల్లో పాల్గొన్న పోతున్నారని వారు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి వయసుల వారికి క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.ఇందుకోసం శాసనసభ సచివాలయము తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మరియు రాష్ట్ర సాంస్కృతిక శాఖ తోపాటు వివిధ శాఖల సమన్వయంతో శాసనసభ్యులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్ శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ యశస్విని రెడ్డి , పాల్వాయి హరీష్ రావు, శాసనమండలి సభ్యులు తాత మధుసూదన్ రావు భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి శాసనమండలి కార్యదర్శి నరసింహచార్యులు శాసనసభ కార్యదర్శి ఆర్ తిరుపతి వివిధ క్రీడా వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 ప్రారంభ వేడుకలు ఎల్బీ స్టేడియంలో 28వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమవుతాయని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తోపాటు ఉభయ సభల వివిధ పక్ష నేతలు విప్ లు అన్ని పార్టీల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.

నేటి సాక్షి
కరీంనగర్ | శుక్రవారం 27 మార్చి 2026

# ప్రపంచ దేశాలకు భారీ ఊరట

- తెరుచుకున్న 'హార్మూజ్' జలసంధి!
- భారత్ సహా మిత్ర దేశాల సరుకు రవాణాకు ఇరాన్ గ్రీన్ సిగ్నల్
- రంగంలోకి దిగిన ఐక్యరాజ్యసమితి..
- చమురు, గ్యాస్ రవాణా కష్టాలకు చెక్
- ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ అధికారిక ప్రకటన



**టెహ్రాన్/ముంబై, మార్చి 26 (మనసులో మాట):** మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన 'హర్మూజ్' జలసంధిని తిరిగి తెరుస్తున్నట్లు ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. భారత్‌తో పాటు చైనా, రష్యా, ఇరాక్, పాకిస్తాన్ వంటి మిత్ర దేశాలకు చెందిన సరుకు రవాణా నౌకల రాకపోకలకు తక్షణమే అనుమతి ఇస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి వెల్లడించారు. ఈ మేరకు ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ గురువారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. హర్మూజ్ జలసంధిని మూసివేయడం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ రవాణా స్తంభించిపోయి సామాన్య ప్రజలు తీవ్ర అభద్రతా భావానికి గురవుతున్నారని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధ వాతావరణాన్ని తగ్గించి, జలసంధిని తెరవాలని ఆయన చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఇరాన్, ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని తక్షణమే ముగించాలని అమెరికా, ఇజ్రాయెల్‌లను కూడా గుటెర్రెస్ ఈ సందర్భంగా కోరారు. "సంఘర్షణ పరిణామాలను తగ్గించడానికి పోరాటాన్ని ముగించడమే సరైన నిర్ణయం" అని ఆయన పేర్కొన్నారు.

### భారత ఆర్థిక వ్యవస్థకు మేలు

ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ మార్గం గుండానే వెళ్తుంది. జలసంధి పునరుద్ధరణతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు స్థిరపడే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్‌కు చమురు దిగుమతులు సులభతరం కావడంతో పాటు ఎగుమతి రంగంపై ఉన్న ఒత్తిడి కూడా తగ్గనుంది. ఈ నిర్ణయం పట్ల అంతర్జాతీయ వాణిజ్య వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# అమెరికాను ఎదుర్కొనేలా ఇరాన్ ఎత్తులు

- ఖర్గ్ ఐలాండ్‌లో భారీగా మందుపాతరలు



**టెహ్రాన్, మార్చి 26:** ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకునే ఉద్దేశంతో పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా తన బలగాలను మోహరిస్తోందని వార్తలు వస్తున్న ఈనేపథ్యంలో ఖర్గ్‌ను రక్షించుకునేందుకు ఇరాన్ సిద్ధమైంది. ఇందుకోసం అమెరికా దళాలను అక్కడ అడుగుపెట్టనీయకుండా ఇరాన్ భారీగా మందు-పాతరలు అమర్చినట్లు సమాచారం. వాటితో విధ్వంసకర ఉచ్చులు పన్నుతోందని తెలుస్తోంది. అంతేకాకుండా అక్కడికి భారీగా బలగాలను కూడా తరలిస్తున్నట్లు అంతర్జాతీయ వార్తా కథనం వెల్లడించింది. హర్మూజ్ జలసంధిని తెరిపించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఓ సాధనంగా వాడాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంలోని ఓ దేశం సహకారంతో ద్వీపాలను ఆక్రమించు కోవాలని మా శత్రువులు సన్నాహాలు చేస్తున్నారన్న నిఘా సమాచారం ఉంది. శత్రువుల కదలికలను మేం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. శత్రువు ఒక్క అడుగు ముందుకువేసినా.. పశ్చిమాసియాలోని ఆ దేశంలోని కీలక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఎడతెగని దాడులు చేస్తాం అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఎంబీ ఘలిబాఫ్ ఇప్పటికే హెచ్చరికలు చేశారు. అమెరికా సైనికులు, కమాండర్ల ఆచూకీ చెప్పండంటూ పశ్చిమాసియా దేశాలకు ఇరాన్ (ఎసజీని) విజ్ఞప్తి చేసింది. అమెరికా స్థావరాలపై తాము దాడులు చేస్తుండటంతో అక్కడున్న యూఎస్ సైనికులు ఇతర ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారని ఇరాన్ వెల్లడించింది. పశ్చిమాసియా దేశాల ప్రజలు వారి ఆచూకీని వెల్లడించాలని కోరుతున్నాం. అలాగే మీ భద్రత కోసం వారిని బహిష్కరించండని అడిగింది. తమ దాడుల్లో దెబ్బతిన్న అమెరికా స్థావరాలు నిర్జన ప్రాంతాలుగా మారాయని పేర్కొంది. 13 సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయని వెల్లడించింది. భూతల దాడుల వార్తల నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాన్ని ఇరాన్ హెచ్చరించింది. నెతన్యాహు, ట్రంప్ చేస్తోన్న మోసానికి మీ పిల్లలను బలిచేయకండంటూ హెచ్చరించింది.


# నిలకడగా సోనియా ఆరోగ్యం

## హెల్త్ బులిటిన్ విడుదల



**న్యూఢిల్లీ, మార్చి 26:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. మార్చి 24వ తేదీ రాత్రి 10.22 గంటల ప్రాంతంలో జ్వరం కారణంగా ఆమె న్యూఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో చేరారు. ప్రత్యేక వైద్యుల బృందం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోనియా ఆరోగ్యానికి సంబంధించి గంగారాం ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ విజయ్ స్వరూప్ గురువారం హెల్త్ బులిటిన్ విడుదల చేశారు. సోనియా ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిపారు. చికిత్సకు సోనియా ఆరోగ్యం సహకరిస్తోందని వెల్లడించారు. ఆమెకు సీనియర్ డాక్టర్ల బృందం చికిత్స అందిస్తోందని, ఇంకా పర్యవేక్షణ అవసరం ఉందని తెలిపారు. కాగా, డాక్టర్లు సిస్టమేటిక్ ఇన్‌ఫెక్షన్‌ను నయం చేయడానికి సోనియాకు యాంటీ బయాటిక్స్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మరికొన్ని రోజులు ఆమెను ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందించే అవకాశం ఉంది.

# రష్యా నుంచి ఇరాన్‌కు డ్రోన్లు



**ఢిల్లీ, మార్చి 26(మనసులో మాట):** అమెరికా-ఇజ్రాయెల్‌తో యుద్ధం చేస్తోన్న ఇరాన్‌కు రష్యా నుంచి సహాయం అందుతున్నట్లు తెలుస్తోంది. ఆ దేశానికి పుతిన్ ప్రభుత్వం దశలవారీగా డ్రోన్లను డెలివరీ చేస్తోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నెలాఖరుకు ఆ రవాణా పూర్తికానుందని వెల్లడించాయి. డ్రోన్లతో పాటు ఆహారం, ఔషధాలను కూడా పంపిస్తోందని రాసుకొచ్చాయి. 'ఇరాన్ అభివృద్ధి చేసిన డ్రోన్లను రష్యా తయారుచేస్తోంది. వాటిని ఉక్రెయిన్ యుద్ధంలో ఉపయోగిస్తోంది. ఇరాన్ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ షిప్‌మెంట్లు చేస్తోంది' అని పశ్చిమదేశాల నిఘా సమాచారాన్ని ఉటంకించాయి. అమెరికా యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, సైనిక స్థావరాల గురించి ఇరాన్ కు రష్యా 'రియల్ టైమ్ ఇంటెలిజెన్స్' సహకారం అందిస్తోందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆ సమాచారాన్ని ఇరాన్‌కు రష్యా చేరవేస్తోందని వాటి సారాంశం. ఇక తాజా కథనాలపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి స్పందించారు. 'ప్రస్తుతం చాలా నకిలీ వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడ ఒకటి మాత్రం వాస్తవం. ఇరాన్ నాయకత్వంతో మా సంప్రదింపులు కొనసాగిస్తున్నాం' అని స్పష్టం చేశారు.

### ఇరాన్‌లోని రష్యా ఉద్యోగులు వెనక్కి..

ఇరాన్‌లోని బుషెహర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నుంచి తన ఉద్యోగులను రష్యా వెనక్కి రప్పించింది. మంగళవారం ఈ ప్లాంట్‌పై క్షిపణి పడిన నేపథ్యంలో 163 మంది సిబ్బందిని అక్కడినుంచి తరలించింది. ఈ ప్లాంట్‌ను నిర్మించింది రష్యానే. మిగతా యూనిట్ల నిర్మాణం కోసం అక్కడ కొందరు సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి అక్కడ కార్యకలాపాలను నిలిపివేసింది.

# నేడు సీఎంలతో ప్రధాని 'వార్' మీటింగ్!

- ఇరాన్ యుద్ధం, చమురు సంక్షోభంపై అత్యవసర సమీక్ష
- సాయంత్రం 6:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భేటీ
- చమురు భద్రత, విదేశీ భారతీయుల రక్షణపై కీలక చర్చ
- ఎన్నికల రాష్ట్రాల సీఎంలకు మినహాయింపు.. అధికారులతో కేంద్రం సమన్వయం


**న్యూఢిల్లీ, మార్చి 26 :** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ రంగంలోకి దిగారు. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అస్థిరత భారత్‌పై చూపుతున్న ప్రభావాన్ని అంచనా వేసేందుకు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో శుక్రవారం ఆయన అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 6:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ భేటీ జరగనుంది. దేశవ్యాప్తంగా చమురు సరఫరా, నిత్యావసరాల ధరల స్థిరీకరణ మరియు విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల రక్షణే ప్రధాన అజెండాగా ఈ సమావేశం సాగనుంది. యుద్ధం వల్ల చమురు కొరత ఏర్పడకుండా తగిన ప్రణాళికలు రూపొందించడం, సరఫరా మార్గాలను సురక్షితంగా ఉంచడం వంటి అంశాలపై ప్రధాని రాష్ట్రాలకు దిశానిర్దేశం చేయనున్నారు. అంతర్జాతీయ పరిణామాలు ఎలా ఉన్నా, స్థానికంగా ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవాలని, కేంద్ర-రాష్ట్రాలు 'టీమ్ ఇండియా'గా ఐక్యంగా ఉండి ఏలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని మోదీ పిలుపునివ్వనున్నారు. ప్రధానంగా చమురు భద్రత (రాఅశ్రీ రావఛబతీఃఎ) విషయంలో రాష్ట్రాలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై చర్చించనున్నారు.

### ఎన్నికల రాష్ట్రాలకు ప్రత్యేక వెసులుబాటు..

ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సమావేశానికి దూరంగా ఉండే అవకాశం ఉంది. అయితే, పాలనాపరమైన ఇబ్బందులు కలగకుండా ఆ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్ విడిగా సమావేశం కానుంది. కేంద్రం తీసుకోబోయే కీలక నిర్ణయాలను, కార్యాచరణను అధికారులకు వివరించనున్నారు. ముఖ్యమంత్రులతో భేటీ అనంతరం, దేశంలో నెలకొన్న



తాజా పరిస్థితులపై ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. యుద్ధం వల్ల తలెత్తే ఆర్థిక భారానికి సంబంధించి ధరల స్థిరీకరణ నిధి వినియోగంపై కూడా ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## సంపాదకీయం

# ట్రంప్ మూర్ఖానికి ప్రపంచదేశాలు మూల్యం!

అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఈ సంవత్సరపు అతిపెద్ద విలన్లుగా ప్రపంచంలో అవతరించారు. తమ యుద్ధ దాహానికి ప్రపంచాన్ని బలి తీసుకున్నారు. ఆయుధ సంపత్తి ఉందికదా అని ఇరాన్‌పై విచ్చలవిగిగా జరిపిన బాంబు దాడిలో ఇప్పటికే ఇరాన్ బాగా దెబ్బతింది. ఇరాన్ దాడుల్లో గల్ఫ్ దేశాలు కూడా దెబ్బిన్నాయి. ఈ క్రమంలో ఏం సాధించారో ట్రంప్ ప్రపంచానికి చెప్పాలి. గతంలో ఇరాక్‌లో ఇలాంటి దడి చేసి సద్దాం హెస్సేన్‌ను ఉరేశారు. ఇక్కడ ఖమేనీని చంపేశారు. వీరి యుద్ధాలు ప్రపంచానికి సంకటంగా మారాయి. ట్రంప్ తీరుతో ప్రపంచం కొరివితో తలగోక్కున్నట్లుగా తయారయ్యింది. ఇరాన్‌ను లొంగదీసుకుంటానని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. క్రమంగా వెనక్కి జారుకున్నారు. చర్చలు జరుగుతున్నాయని, ఐదు రోజులపాటు యుద్ధానికి విరామం ఇస్తున్నామని ప్రకటించారు. అయితే, ఇరాన్ మాత్రం.. యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఇప్పటి వరకూ.. తమకూ అమెరికాకు మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని, తాము చర్చలకు సిద్ధంగా లేమని స్పష్టం చేసింది. మీరు దాడులు మొదలు పెట్టి మీరే షరతులు పెడతారా అని నిలదీసింది. మేమూ షరతలు పెడతామని చెప్పింది. మొత్తమ్మీద, ట్రంప్ మాటలకు విశ్వసనీయత లేద ని, రోజుకో మాట మాట్లాడటమే ఆయన తీరని మరోసారి రుజువైంది. ఏదేమైనా.. ట్రంప్ వెనక్కి తగ్గటం మాత్రం కాదనలేని వాస్తవం. ట్రంప్ తీరుపై స్వదేశంలోనూ తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇజ్రాయిల్ కోల్పోయిందేమీ లేదు క ఆనీ, అమెరికా భారీగా నష్టాన్ని మూటగట్టుకుంది. ఓ రకంగా చెప్పాలంటే యుద్ధంలో ఇరాన్ గెలిచిందనే చెప్పాలి. ఇరాన్ మీద కయ్యానికి కాలు దువ్వినప్పుడు అమెరికా-ఇజ్రాయెల్‌లకు ఓ స్పష్టమైన లక్ష్యం లేదు. ఖమేనీ సారథ్యంలోని ప్రభుత్వాన్ని పడగొడతామని ఒకసారి, ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయకుండా చూడటం అని మరోసారి, ఇరాన్ నుంచి అమెరికాకు ముప్పు పొంచి ఉందని, ఆ దేశాన్ని లొంగదీసుకుంటామని ఇంకోసారి.. ఇలా పూటకో మాట చెప్పారు ట్రంప్. మరోవైపు, తమ మీద రుద్దిన ఈ యుద్ధాన్ని ఎదుర్కొని తమ దేశ సమగ్రతను కాపాడుకునే ఏకైక, స్పష్టమైన లక్ష్యంతో ఇరాన్ యుద్ధంలోకి దిగింది. అంతులేని యుద్ధాలకు ముగింపు పలుకుతానని, అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుస్తానంటూ రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్.. అమెరికాకు ఏ విధంగానూ అవసరం లేని యుద్ధం చేస్తున్నారన్న భావన అమెరికన్లలో వ్యాపించింది. తాము కట్టిన పన్నుల్ని నెతన్యాహూ కోసం ఎందుకు ఖర్చు చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, అమెరికాలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత పెరిగాయి. స్థిరచిత్తం లేని ట్రంప్ మాటలతో, చేతలతో అమెరికా అధ్యక్ష పదవి ఓ జోకులాగా తయారైంది. స్వయంగా ట్రంప్ మద్దతుదారులు కూడా ఈ యుద్ధాన్ని సమర్థించటం లేదు. సర్వేల్లో ట్రంప్ ప్రజాదరణ రోజురోజుకీ దిగజారుతోంది. మరోవైపు, ఈ ఏడాది చివర్లో అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికలు జరగనున్నాయి. అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీకి పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేవన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే, తాజాగా వెనక్కి తగ్గారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెనెజువెలాలో అధ్యక్షుడు మదురో అధికారిక నివాసంపై దాడి చేసి రాత్రికి రాత్రి కిడ్నాప్ చేసి అమెరికాకు తీసుకొచ్చిన ట్రంప్.. ఇరాన్ మీద కూడా అదే ఎ÷-లాన్ అమలు చేయాలని భావించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ రాజధాని టెహ్రాన్‌లో సైనిక, పౌర ఉన్నతాధికారులతో సమావేశమైన తరుణంలో వారి మీద అమెరికా, ఇజ్రాయెల్ అకస్మాత్తుగా బాంబులు కురిపించాయి. వారిని హత్య చేసి యుద్ధం ప్రారంభించాయి. ఖమేనీ హత్య తర్వాత.. అప్పటి వరకూ ఉన్న అంతర్గత విభేదాలు, ప్రభుత్వం మీద ఉన్న అసమ్మతిని కూడా పక్కనపెట్టి.. దేశ పరిరక్షణకు యావత్ ఇరాన్ ఒక్కటైంది. ఆ దేశంలోని ప్రతీ పట్టణంలో.. ఓవైపు క్షిపణులు, బాంబులు పడుతున్నా కూడా బెదరకుండా.. రోడ్ల మీదికి పెద్ద సంఖ్యలో వచ్చి ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తూ ర్యాలీలు జరిపారు. ఇప్పటికీ ఇవి కొనసాగుతున్నాయి. ఇరాన్ బలాబలాలేమిటి అన్నది సమగ్రంగా సమీక్షించకుండానే ట్రంప్ ఈ యుద్ధంలోకి దిగారు. అమెరికా సైన్యాధికారులతో సంప్రదించలేదు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నేతృత్వంలోని శక్తిమంతమైన యూదు లాబీ మాటలువిని ట్రంప్ యుద్ధం నిర్ణయం తీసుకున్నారని స్వయంగా అమెరికా ఉగ్రవాద నిరోధక విభాగం డైరెక్టర్ జో కెంట్ వెల్లడించి నిరసనగా పదవికి రాజీనామా చేశారు. గల్ఫ్ మొత్తానికి యుద్ధాన్ని విస్తరిస్తుందని ట్రంప్, నెతన్యాహు ఊహించి ఉండరు. ఇక హాళర్మూజ్ జలసంధిని అడ్డుకోవటం ద్వారా ఇరాన్ తన వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది. దీంతో యుద్ధం ప్రభావం యావత్ ప్రపంచం మీద పడింది. దీనికి ట్రంప్ దూకుడే కారణం. ప్రపంచం యావత్తూ గ్యాస్, ఇంధనాల కొరతతో అల్లుడుతోంది. ఆయా దేవాల ఆర్థిక స్థితి దారుణంగా పడిపోయింది. ఇప్పట్లో ఈ నష్టాల నుంచి కోలుకోవడం ఎవరికైనా కష్టమే.

నేటి సాక్షి
TGTEL/25/A1737
కరీంనగర్ | శుక్రవారం 27 మార్చి 2026


# విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేస్తే అరెస్టులా



- ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నిరసన

**నేటి సాక్షి గజ్వేల్:** విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, మెస్ కాస్మోటిక్ చార్జీలను చెల్లించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఇచ్చిన "చలో అసెంబ్లీ" పిలుపుకు ప్రభుత్వం అక్రమ అరెస్టులతో అడ్డుపడటం అన్యాయమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గజ్వేల్ డివిజన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కోనేరు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మార్చి 25న "చలో అసెంబ్లీ" కార్యక్రమానికి పిలుపునిచ్చిన ఎస్ఎఫ్ఐ నాయకులను ప్రభుత్వం ఎక్కడికక్కడ నిర్బంధించి అరెస్టు చేయించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే గొంతులను నొక్కివేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు మెస్ కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరి మారకపోతే రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు నందిని, భవ్య, శృతి, అఖిల, నాయకులు నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో 'గుట్టు'గా వ్యభిచారం




- లాడ్జీలు, ఫామ్ హౌస్‌లే అడ్డాగా అక్రమ దందా
- నగరాల నుంచి మహిళల తరలింపు..
- పోలీసుల తనిఖీలకు స్థానికుల డిమాండ్

**నేటి సాక్షి, గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు సాగుతున్నాయనే వార్తలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. పట్టణంలోని కొన్ని లాడ్జీలు, ప్రైవేట్ అద్దె ఇళ్లు మరియు శివారు ప్రాంతాల్లోని ఫామ్ హౌస్‌లలో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పరిణామాలు పట్టణ ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

### పెద్ద నెట్‌వర్క్ ఉందా?

హైదరాబాద్ వంటి నగర ప్రాంతాల నుండి మహిళలను గజ్వేల్‌కు తరలించి ఈ అక్రమ కార్యకలాపాల్లో నిమగ్నం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనుక ఒక పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోందని, మానవ అక్రమ రవాణా (ట్రాఫికింగ్) కోణంలో కూడా ఈ వ్యవహారాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు భావిస్తున్నారు. కొన్ని ప్రైవేట్ గృహాల్లో అద్దెకు ఉంటూనే ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం.

### అధికారుల పర్యవేక్షణ కరువు

ఈ అక్రమ కార్యకలాపాలపై ఫిర్యాదులు అందుతున్నా, సంబంధిత అధికారులు తగిన స్థాయిలో తనిఖీలు నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గంలోని పలు ప్రైవేట్ ఫామ్ హౌస్‌లు ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### తక్షణ చర్యలకు డిమాండ్

మహిళల భద్రత మరియు సామాజిక శాంతికి భంగం కలగక ముందే పోలీసులు స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, వాస్తవాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి, ఈ అక్రమ దందాను పూర్తిగా అరికట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# చెన్నూర్‌లో 'అరైవ్-అలైవ్' శిబిరం..






- డ్రైవర్లకు కంటి వెలుగు.. ప్రజలకు చలివేంద్రం
- 150 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు
- గాంధీ చౌక్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన డీసీపీ భాస్కర్, ఏసీపీ వెంకటేశ్వర్లు

**నేటి సాక్షి, చెన్నూర్:** రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే 'అరైవ్-అలైవ్' కార్యక్రమంలో భాగంగా చెన్నూర్ పట్టణ ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్ ఆధ్వర్యంలో గురువారం డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు స్పష్టమైన చూపు అవసరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ శిబిరంలో 150 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించగా, 24 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో ఐదుగురికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. అనంతరం పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తి తీర్చడానికి గాంధీ చౌక్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీసీపీ, ఏసీపీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్యాంపటేల్, సుబ్బారావు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మరణంలోనూ వీడని మమకారం.. అవయవ దానంతో అమరత్వం

- కోరుట్ల హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరాజం అకాల మృతి.. ఇద్దరికి పునర్జన్మనిచ్చిన కిడ్నీలు
- భార్య రాధ నిర్ణయం సాహసోపేతం.. ఎస్పీ అశోక్ కుమార్ ప్రగాఢ సంతాపం

**నేటి సాక్షి,కోరుట్ల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నల్లాల లక్ష్మీరాజం మరణానంతరం కూడా ఇద్దరికి ప్రాణదాతగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. విధి నిర్వహణలో ఉండగానే ఆయన ఆకస్మికంగా మరణించడంతో జిల్లా పోలీస్ శాఖ తీవ్ర విషాదంలో మునిగిపోయింది. అయితే, పుట్టెడు దుఃఖంలోనూ ఆయన భార్య రాధ తీసుకున్న నిర్ణయం అందరినీ కదిలించింది. లక్ష్మీరాజం రెండు కిడ్నీలను దానం చేయడంతో ఇద్దరు వ్యక్తులకు పునర్జన్మ లభించింది. ఈ గొప్ప కార్యంతో ఆయన మరణానంతరం కూడా మరొకరి రూపంలో సజీవంగా నిలిచారు. లక్ష్మీరాజం మృతికి జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యుల నిర్ణయం సమాజానికి ఆదర్శమని కొనియాడారు. క్రమశిక్షణ గల అధికారిగా లక్ష్మీరాజం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.



# నేర నియంత్రణకు సీసీ కెమెరాలే రక్ష

### పిడిచేడ్‌లో 12 సీసీ కెమెరాలను ప్రారంభించిన ఏసీపీ నర్సింహులు



**నేటి సాక్షి, గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం పిడిచేడ్ గ్రామంలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలను ఏసీపీ నర్సింహులు, సర్పంచ్ అశోక్ రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడానికి, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి గ్రామం భద్రత దిశగా ఇలాంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ భద్రత దృష్ట్యా ఈ కెమెరాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రవికుమార్, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# 9న హిందూ మహాసమ్మేళనం

### విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ పిలుపు



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని సంత బజార్‌లో ఏప్రిల్ 9న నిర్వహించనున్న 'హిందూ మహాసమ్మేళనం'ను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చెన్నయ్య, అధ్యక్షుడిగా వెంకటేశ్వర శర్మ, కార్యదర్శిగా ముకుంద రెడ్డి, కోశాధికారిగా విద్యాసాగర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మరికల్, అప్పంపల్లి, మాధవరం సహా పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మేళన ఏర్పాట్లపై చర్చించారు.

# అసభ్య ప్రవర్తన..


### తెలుగు ఉపాధ్యాయుడి సస్పెన్షన్



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** మద్దూరు మండలం మోమినాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన తెలుగు ఉపాధ్యాయుడు స్వామిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) గోవిందరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై ఎంక్వైరీ అధికారుల విచారణ నివేదిక మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పాఠశాలల్లో క్రమశిక్షణ తప్పినా, విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరించారు.

# రామాలయానికి పూజారిని నియమించాలి

### కిష్టాపూర్ దేవాలయంలో సౌకర్యాలు కల్పించాలి: వడ్డే ఆంజనేయులు



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామ శివారులో వెలసిన పెద్ద బండ శ్రీ శ్రీ శ్రీ రామ ఆలయంలో శాశ్వత పూజారిని ఏర్పాటు చేయాలని గ్రామ యువకుడు వడ్డే ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పురాతన ఆలయానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు వస్తుంటారని, అయితే సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆలయానికి ప్రత్యేక పూజారిని నియమించాలని, భక్తుల కోసం మంచినీటి సౌకర్యంతో పాటు రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి, ఎంపీ డీకే అరుణ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

### చిట్టాపూర్ గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకున్న నర్సయ్య



**నేటి సాక్షి, మల్లాపూర్,(రాధారపు నర్సయ్య):** మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలో అనారోగ్య కారణాలతో మనస్తాపం చెందిన బొమ్మెన నర్సయ్య (75) అనే వృద్ధుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గత రెండు రోజుల నుంచి నర్సయ్య కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం గ్రామ శివారులోని ఒక చెట్టుకు నర్సయ్య ఉరి వేసుకొని మృతి చెంది ఉండటాన్ని గమనించారు. మృతుడి భార్య బొమ్మెన హనుమక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి సాక్షి
కరీంనగర్
శుక్రవారం
27 మార్చి 2026

# భీమారం పోలీస్ స్టేషన్ తనిఖీ

**రికార్డుల పరిశీలన.. పెండింగ్ కేసుల పరిష్కారానికి ఆదేశం**



**నేటి సాక్షి, భీమారం:** మంచిర్యాల డీసీపీ భాస్కర్ గురువారం భీమారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్‌లతో కలిసి స్టేషన్ పరిసరాలను, రికార్డులను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిస్థితులు, సిబ్బంది పనితీరు మరియు నమోదవుతున్న కేసుల వివరాలను ఎస్సై రాజేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న డీసీపీ, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా మారుమూల గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

# లక్కీడ్రా పేరిట మోసాలు

**ఇద్దరిపై కేసు నమోదు**



**నేటిసాక్షి,వెల్గటూర్:** లక్కీ డ్రా పేరుతో ప్రజలను నమ్మించి, వారి నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ధర్మపురి సిఐ ఎ. రాంనర్సింహారెడ్డి మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.ధర్మారం మండలానికి చెందిన కట్ట రమేష్, కళ్లెం నరేందర్ అనే వ్యక్తులు "మా అవసరం-మీ అదృష్టం" అనే పేరుతో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా లక్కీ డ్రా నిర్వహిస్తున్నారు. ఒక్కో కూపన్‌కు రూ. 1,116/- వసూలు చేస్తూ, విజేతలకు భారీ బహుమతులు ఇస్తామని ప్రజలకు మాయమాటలు చెప్పి మోసగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.నమ్మదగిన సమాచారం మేరకు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ సందర్భంగా సిఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా లక్కీ డ్రాలు నిర్వహించి ప్రజలను మోసం చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఇటువంటి మోసపూరిత ప్రకటనలను నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దు.మీ ప్రాంతంలో ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.ఈ సమావేశంలో సిసిఎస్ సిఐ ఎం. శ్రీనివాస్, వెల్గటూర్ ఎస్సై పి. ఉదయ్ కుమార్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయంసేవక్ గంగారాం కన్నుమూత

**ఆర్ఎస్ఎస్ సేవలో విశేష కృషి. కోరుట్లలో విషాదం**




**నేటి సాక్షి, కోరుట్ల, (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణానికి చెందిన సీనియర్ స్వయంసేవక్ వెంకటరెడ్డి గంగారాం (76) గురువారం మృతి చెందారు. బాల్య స్వయం సేవక్‌గా ప్రారంభమైన ఆయన ప్రయాణం జీవితాంతం సేవామార్గంలో కొనసాగింది. ఆయన మృతి స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తూ కూడా ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. ఎమర్జెన్సీ కాలంలో కూడా వెనుకడుగు వేయకుండా సంఘ కార్యక్రమాలకు తోడ్పాటునందించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ అనేక మందికి ఆదర్శంగా నిలిచారు. ఆయన మృతి పట్ల జగిత్యాల జిల్లాలోని ఆర్ఎస్ఎస్ అధికారులు, స్వయంసేవకులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఆయన అంతిమ యాత్ర నిర్వహించనున్నారు.

# బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

**కోరుట్ల నవోదయ స్కూల్ సమీపంలో ప్రమాదం.. అతివేగమే కారణం**

**నేటి సాక్షి, కోరుట్ల,(రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని అన్నమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన కళ్లెం లింగవ్వ (63) గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 5:40 గంటల సమయంలో జవహర్ నవోదయ స్కూల్ సమీపంలో లింగవ్వ రోడ్డు దాటుతుండగా, కోరుట్ల నుండి వేములవాడ వైపు వెళ్తున్న హీరో గ్లామర్ బైక్ అతివేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు, కాలికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బస్టాండ్ వద్ద ఆమె మృతి చెందారు. మృతురాలి కుమారుడు కళ్లెం రామచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతివేగం, అజాగ్రత్త డ్రైవింగే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు.

# లక్ష్యం వైపు సాగండి.. వ్యసనాలకు దూరంగా ఉండండి






- దేవులవాడ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించిన సీఐ కృష్ణ
- గంజాయి, మైనర్ డ్రైవింగ్‌తో భవిష్యత్తు నాశనం.. క్రమశిక్షణే విజయానికి బాట

**నేటి సాక్షి,చెన్నూరు రూరల్:** విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకుని, క్రమశిక్షణతో వాటిని సాధించాలని చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ పిలుపునిచ్చారు. పోలీస్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గురువారం కోటపల్లి మండలంలోని దేవులవాడ జెడ్పీహెచ్ఎస్ (గ్రాన్గా) పాఠశాలలో విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజా యి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, వేధింపులకు గురైతే వెంటనే 'షీ టీమ్' సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, చట్టపరమైన చర్యల పట్ల అప్రమత్తం చేశారు. ఆటంకాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి ఎస్సై రాజశేఖర్, హెడ్ మాస్టర్ శ్రీనివాస్ రావు, సర్పంచ్ ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తత అవసరం







- గురుకుల డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు.. ముఖ్య అతిథిగా డీఎస్పీ వెంకటరమణ
- మోసపోతే 1930కి కాల్ చేయాలి.. విద్యార్థినులకు సైబర్ భద్రతపై కీలక సూచనలు

**నేటి సాక్షి, జగిత్యాల,( రాధారపు నర్సయ్య):** మహిళలు, విద్యార్థినులు సోషల్ మీడియా వేదికగా జరిగే సైబర్ మోసాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ సూచించారు. గురువారం జిల్లా ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇటీవల కాలంలో సైబర్ స్టాకింగ్, బుల్లీయింగ్ ఘటనలు పెరుగుతున్నాయని, తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ఫేక్ ప్రొఫైల్స్, ఫిషింగ్ లింకులు మరియు ఓటీపీ (OTP) మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. సకాలంలో స్పందిస్తే కోల్పోయిన సొమ్మును తిరిగి పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో సైబర్ భద్రతపై ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై ఉమాసాగర్, సైబర్ క్రైమ్ ఎస్సైలు కృష్ణ, దినేష్, ప్రిన్సిపాల్లు అశోక్, శ్రీలత మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అన్యాయం.. ధాన్యం డబ్బుల్లో భారీ కోత

- కోనాపూర్ 'ప్యాక్స్'లో నిధుల దుర్వినియోగం ఆరోపణలు
- 85 బస్తాల ధాన్యానికి సగం డబ్బే జమ.. జిల్లా కలెక్టర్‌కు బాధితుడి ఫిర్యాదు

**నేటి సాక్షి, జగిత్యాల,(రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం కోనాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు చెల్లింపుల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోచంపేట్ గ్రామానికి చెందిన రైతు జుంబర్తి రాజనర్సయ్య తనకు రావాల్సిన వరి ధాన్యం డబ్బులు పూర్తిగా చెల్లించలేదని ఆరోపిస్తూ గురువారం జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధిత రైతు రాజనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వానకాలం 2025 సీజన్‌లో తన 85 బస్తాల వరి ధాన్యాన్ని కోనాపూర్ ప్యాక్స్ (గ్రాజ) కేంద్రం ద్వారా విక్రయించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం ఆయనకు మొత్తం రూ. 81,226 రావాల్సి ఉంది. అయితే, ఆయన బ్యాంకు ఖాతాలో కేవలం రూ. 33,408 మాత్రమే జమ అయ్యాయి. మిగిలిన రూ. 47,818 ఇప్పటికీ అందలేదు. మిగిలిన నిధులను ప్యాక్స్ సీఈఓ రమాదేవి మరియు సంబంధిత సిబ్బంది కలిసి దుర్వినియోగం చేశారని రైతు ఆరోపించారు. తనకు రావలసిన డబ్బుల కోసం పలుమార్లు ప్యాక్స్ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు సరైన సమాధానం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్ సమక్షంలో విచారణ జరిపించినప్పటికీ, ప్యాక్స్ సిబ్బంది నుంచి స్పష్టత రాలేదని, దీనివల్ల తాను తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నిధుల గోల్‌మాల్‌పై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరపాలని రాజనర్సయ్య డిమాండ్ చేశారు. బాధ్యులైన సీఈఓ మరియు ఇతర సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తన ఖాతాలో వెంటనే మిగిలిన సొమ్మును జమ చేయాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని ఆయన కలెక్టర్‌ను విన్నవించారు.



# ప్రజా దంత వైద్యశాలకు 13ఏళ్ళు




- గ్రామాల్లో 2 వేల ఉచిత వైద్య శిభిరాలు
- 50 వేల విలువ గల దంత కిట్స్ ఉచితంగా పంపిణి
- డాక్టర్. సృజన, డా.వనిత ల వెల్లడి

**నేటి సాక్షి,జగిత్యాల టౌన్,(పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లాలోనీ గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రతి గురువారం ఉచితంగా దంత వైద్య సేవలాందిస్తు ప్రజాధరణ పొందుతున్న జగిత్యాలలోని సృజన దంత వైద్యశాల 13 ఏళ్ళుపూర్తి చేసుకుంది. జగిత్యాల జిల్లా కేంద్రంలో డాక్టర్.సృజన పేరున ఆసుపత్రి పెట్టుకుని ప్రతి గురువారం రోగులకు పీజు లేకుండా ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు మందులు ఉచితంగా అందిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు. ఈనెల 20 నుండి 26 వరకు ఆసుపత్రి 13 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారం రోజులపాటు ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఉచితంగా దంత పరీక్షలు చేస్తూనే 50వేల విలువ చేసే నోటి సంరక్షణకు అత్యవసరంగా వాడే వస్తువులను ( దంత కిట్స్ ) సృజన దంత ఆసుపత్రి సౌజన్యంతో డాక్టర్.నక్క వనిత తన సిబ్బంది పూజ లీనా లతో ఉచితంగా రోగులకు అందించి ప్రశంషాలు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వనిత గురువారం జగిత్యాలలో మాట్లాడుతూ. ఆసుపత్రి స్థాపించినప్పటి నుండి జగిత్యాల జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 2 వేల ఉచిత దంత వైద్య శిభిరాలు నిర్వహించి,ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు దంత సమస్యలపై ప్రజలకు అవగాహనా కల్పించినట్లు తెలిపారు.ఈనెల 20 నుండి వారం రోజుల పాటు ఆసుపత్రిలో వచ్చిన రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించామని, మల్లన్నపేటలో ఉచిత దంత వైద్య శిభిరం ఏర్పాటు చేశామని, దంత సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు 50 వేల విలువ చేసే దంత కిట్స్ ప్రజలకు అందించామని తెలిపారు. నోటి సంరక్షణతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సూచించారు.ఎప్పటిలాగే ప్రజల సహకారం ఉండాలని, మేము కూడా ప్రజలకు దంత సమస్యల గురించి అన్నీ విధాలుగా అవగాహనా కల్పిస్తామని డాక్టర్ వనిత భరోసా ఇచ్చారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

- రూ. 32.42 కోట్ల అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం
- ఏడాదిలో మురికివాడల అభివృద్ధి.. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ: ఎమ్మెల్యే గడ్డం వినోద్



**నేటి సాక్షి, బెల్లంపల్లి:** బెల్లంపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి ఆయన అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, ఎమ్మెల్యే గడ్డం వినోద్, సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 32 కోట్ల 42 లక్షల అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

ఆదాయం పెంచండి.. ఖర్చులు తగ్గించండి

మున్సిపల్ ఆదాయాన్ని పెంచేందుకు ఇంటి పన్ను, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేయాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలను క్రమం తప్పకుండా వసూలు చేయాలని, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు సోలార్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ అభివృద్ధికి సీఎస్ఆర్ (CSR) నిధుల నుండి రూ. 2.50 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. తాగునీటి ఎద్దడి లేకుండా ముల్కల్ల నుండి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డుల్లో ఏడాది కాలంలో మురికివాడలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పష్టం చేశారు. పారిశుద్ధ్య, పాఠశాలల నిర్వహణపై పాలకవర్గ సభ్యులు జవాబుతారీతనంతో ఉండాలని సూచించారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ 'ఇందిరమ్మ ఇండ్లు' అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి, కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ సత్యనారాయణ మరియు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు ఎస్‌బిఐ 'కార్పొరేట్' భరోసా




- యాదగిరిపల్లి కేంద్రానికి ఎల్ఈడీ టీవీ, ఉపకరణాల పంపిణీ
- అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి: సీడీపీఓ మమత

**నేటి సాక్షి, మిర్యాలగూడ:** ఎస్‌బీఐ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (జూ=)లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మిర్యాలగూడలోని యాదగిరిపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రానికి గురువారం పలు ఉపకరణాలను అందజేశారు. అర్బన్ సీడీపీఓ మమత ముఖ్య అతిథిగా హాజరై అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన ఎల్ఈడీ టీవీ, రైస్ కుక్కర్, వాటర్ ఫిల్టర్, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు మరియు పిల్లల విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మమత మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రీ-స్కూల్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఎస్‌బీఐ సహకారంతో అందిన ఈ ఉపకరణాలు పిల్లల విద్యాభివృద్ధికి, పోషణకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం మిత్రా హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మీరెడ్డి పిల్లలకు బ్యాగులు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ నరేంద్ర, సూపర్వైజర్ హేమా దేవి, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, లక్ష్మి మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కిషన్ రావు పేట బీఆర్ఎస్ అధ్యక్షుడిగా రాజేందర్

- గ్రామ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.. యూత్ అధ్యక్షుడిగా తరాళ్ల శేఖర్
- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి: పార్టీ శ్రేణులకు పిలుపు



**నేటి సాక్షి, వెల్గటూర్:** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్ రావు పేట గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నూతన కమిటీని మండల అధ్యక్షులు చల్లూరి రామచంద్రం గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు గ్రామ శాఖ అధ్యక్షుడిగా పూదరి రాజేందర్, యూత్ అధ్యక్షుడిగా తరాళ్ల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా మోకేనపెల్లి సాగర్, ఉపాధ్యక్షుడిగా గౌరు తిరుపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి నిరంకుశ పాలన సాగిస్తోందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని, 2029లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, జూపాక కుమార్ మరియు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రైసింగ్ హై స్కూల్‌లో ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్






- జంక్ ఫుడ్ నివారణపై విద్యార్థులకు అవగాహన

**నేటి సాక్షి కోరుట్ల,(రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని రైసింగ్ హై స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ తరగతులకు చెందిన విద్యార్థినులు స్వయంగా ఇంట్లో తయారు చేసిన పులిహోర, బిర్యానీ, దోసె, పానీపూరీ, స్వీట్స్ వంటి రుచికరమైన వంటకాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థుల సృజనాత్మకతతో అలరించిన ఈ ప్రదర్శనను పాఠశాల యాజమాన్యం ఆసక్తిగా తిలకించింది. విద్యార్థులు తయారు చేసిన వంటకాల రుచులను ఆస్వాదించిన యాజమాన్యం వారిని అభినందించింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కుడేల రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, పిల్లలు చదువుతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన పెంపొందించేందుకు ఈ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించామని తెలిపారు. ముఖ్యంగా ఇంట్లో తయారు చేసిన సంప్రదాయ వంటకాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని పేర్కొన్నారు. బయట ఫాస్ట్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల ఊబకాయం, గుండె జబ్బులు, మధుమేహం వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 'జంక్ ఫుడ్‌కు నో చెప్పండి..ఇంటి ఆహారానికి యెస్ చెప్పండి' అనే నినాదంతో విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, వారిలో ఆనందాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లిఖితతో పాటు ఉపాధ్యాయులు మోహన్, షహనాజ్ బేగం, వెన్నెల, సుమయ్య, సంజన, మౌనిక, సుమన్ రెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామ దివ్య చరితం

జనకాత్మజాజానకీజగదంబ రూపిణి జ్యోతిర్మయి,<br>
శుభలక్షణ శోభితాంగి శశిముఖి శాంతస్వరూపిణి;<br>
రఘువంశ తిలకుడైన రాముని హృదయరత్నమై,<br>
భువనమంత వెలుగొందె భక్తజన పావన సౌభాగ్యము!<br>
మృదుమందహాస విహారిణి మానస సరస్సు కమలమై,<br>
మంగళ గుణగణ గర్భిణి మాతృస్వరూపిణి మాధుర్యమై;<br>
అరణ్యాంతర గాఢవిపినమున అనుబంధమై నిలిచినది,<br>
అనురాగ దీప్తి సాక్షిగా అచంచల సత్యసంకల్పమై!<br>
రామో విగ్రహవాన్ ధర్మో రమణీయ గుణసాగరో,<br>
సీతా సహచర్యమున్ సదా సౌమ్యమూర్తి సుపావనుడు;<br>
సముద్రం సైతం సంభ్రమించు శౌర్య గంభీర వైభవం,<br>
సేతుబంధ కీర్తి సాక్షిగా సాగరమే స్తుతించెను!<br>
విరహాగ్ని వేడిలోనూ విశ్వాస దీప్తి మాయంకాక,<br>
సీతా హృదయం సత్యసింధు స్ఫటికమై నిలిచెను;<br>
రాముని నామస్మరణే రక్షణమై మార్గదర్శిగా,<br>
ధర్మదీపికగా దివ్యదాంపత్య గాథను నిలిపెను!<br>
అశోకవాటికలో ఆర్తిగా నిలిచిన ఆ మంగళ రూపం,<br>
అమృతధారల కన్నీరై ఆకాశమున్ పలికె గాథ;<br>
ఆ దుఃఖ గాఢతను చీల్చి ఆంజనేయుని దర్శనముతో,<br>
ఆశల చిగురులు విరిసె ఆత్మవిశ్వాస సాక్షిగా!<br>
లంకాపురి లయగర్జనలో రామబాణ జ్వాలలతో,<br>
దశముఖ దర్ప దహనమై ధర్మజయం ఘోషించగా;<br>
సీతా రాముల కలయికలో సర్వలోక మంగళ గానం,<br>
సత్యసంధాన సౌభాగ్యమై సకలజన హృదయముల నిండె!<br>
శ్రీరామ సీతల నామమిదే శాశ్వత మంత్రస్వరూపము,<br>
చిత్తశుద్ధి చెలిమెలై చిగురించే చైతన్య దీపము;<br>
భక్తి పరవశ తరంగిణిలో భవసాగరము దాటించు,<br>
పరబ్రహ్మ సాక్షాత్కార పథమిదే పావన సత్యము<br>
చైత్రమాస శుక్లపక్ష నవమి పుణ్యకళ్యాణ పర్వదినంబున,<br>
సేవాసౌభాగ్య సుధాసింధువై నా చిత్తమున్ పరిపూర్ణమై;<br>
మంజుల పత్తిపాటి మృదులకరాంబుజములందు<br>
శ్రీ సీతారామ కల్యాణ కృత్యము సుగంభీరమై సాగుచుండగా,<br>
కరుణామయ! కటాక్ష కృపాప్రవాహమే కలిగించితివి<br>
ఈ మహాభాగ్యమున్ రామయ్య!<br>
భక్తి పరవశ హృదయంతో శరణాగతి సమర్పించగా,<br>
జన్మార్థక పరమసాఫల్యమై జయనినాదములై విరిసె!<br>
శ్రీ సీతారామ చరణారవింద సేవాసుధా ప్రసాదమున్ స్ఫూర్తి సింధువై,<br>
మంజుల కలమున్ కళామాత కృపతో పద్యరత్నాల వికాసమై;<br>
భక్తహృదయ భావసుమాల వాక్సుధా ప్రవాహమున్ వెలిగించగా,<br>
సీతారామ కటాక్షమే ధన్యజీవిత సత్యమై నిలిచె!<br>
శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ శుభాకాంక్షలు!



రచన: మంజుల పత్తిపాటి<br>
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్,<br>
చరవాణి,934704221<br>
దాద్రి భువనగిరి జిల్లా<br>
తెలంగాణ రాష్ట్రం.

# ప్లాస్టిక్ గ్లాసుల స్వాధీనం




**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్:** కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మెయిన్ మార్కెట్ ప్రాంతంలో ఉన్న జ్యోతి ట్రాన్స్‌పోర్ట్ వద్ద ప్లాస్టిక్ గ్లాసుల నిల్వపై మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు పెద్ద మొత్తంలో గుర్తించి, వాటిని స్వాధీనం స్వాధీనం చేయడం జరిగింది. ఈ తనిఖీలు మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి. ఆదేశాల మేరకు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ ఎం. శంకర్ మరియు ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ డి. ప్రణీల్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు నిల్వ చేయడం, వినియోగించడం పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వ్యాపారస్తులు పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించబడతాయని స్పష్టం చేశారు.

# చదువే జీవితానికి వెలుగు

సీఐ కుమారస్వామి



**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్:** విద్య ద్వారానే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, ప్రతి విద్యార్థి చదువును జీవితానికి వెలుగుగా భావించాలని కాగజ్ నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) కుమారస్వామి అన్నారు. గురువారం రాస్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విద్య ఉంటేనే కుటుంబం, గ్రామం మరియు దేశం అభివృద్ధి చెందుతాయని సీఐ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే ఇంగ్లీష్ డిక్షనరీలు, సాంఘిక శాస్త్రానికి సంబంధించిన అట్లాస్ పుస్తకాలను పాఠశాలకు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈజ్గాం ఎస్సై కల్యాణ్, రాస్పల్లి సర్పంచ్ సుమన్, హెచ్ఎం చిలుకూరి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఏటుకూరి శ్రీనివాసరావు, నాగరాణి, రవికుమార్, సత్యనారాయణ స్వామి, హాస్మీ, వనిత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ వచ్చేసింది





# ఐపీఎల్ టికెట్ల రగడ

## కేఎస్‌సీఏపై ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు!

## ఉచిత టికెట్లను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారని ఆగ్రహం

## రూ. 5 వేల టికెట్ రూ. 35 వేలకు విక్రయం..

**బెంగళూరు:** కర్ణాటకలో ఐపీఎల్ 2026 టికెట్ల వ్యవహారం పెను వివాదానికి దారితీసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే కాశప్పనవర్ విజయానంద శివశంకరప్ప కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ)పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల రాయితీలు.. సౌకర్యాలు పొందుతున్న ఈ సంస్థ ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్యేలు.. మంత్రులు.. వారి కుటుంబ సభ్యులకు కేటాయించాల్సిన ఉచిత టికెట్లను ఇవ్వకుండా వాటిని బ్లాక్ మార్కెట్‌లో భారీ ధరలకు విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. సాధారణంగా 5,000 రూపాయలు ఉండే టికెట్ ధరను ఏకంగా 35,000 రూపాయలకు పెంచి అమ్ముతున్నారని శివశంకరప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి 28న ప్రారంభమయ్యే ఐపీఎల్ మ్యాచ్ నేపథ్యంలో ఈ వివాదం చెలరేగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### ఐపీఎల్ 2026 షెడ్యూల్ విశేషాలు

భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పటికే ఐపీఎల్ 2026 పూర్తి షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ 19వ సీజన్ మార్చి 28 నుంచి మే 24 వరకు జరగనుంది. ప్రారంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో తలపడనుంది. మొత్తం 70 లీగ్ మ్యాచ్‌లలో మొదటి దశలో 20.. రెండో దశలో 50 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా హైదరాబాద్.. చెన్నై.. ముంబై.. కోల్‌కతా.. ఢిల్లీ.. అహ్మదాబాద్ వంటి 12 ప్రధాన నగరాలు ఈ మ్యాచులకు ఆతిథ్యం ఇస్తున్నాయి. మధ్యాహ్నం జరిగే మ్యాచులు 3:30 గంటలకు.. సాయంత్రం మ్యాచులు 7:30 గంటలకు ప్రారంభం కానున్నాయి.

### వేదికల మార్పు.. హోం గ్రౌండ్స్

ఈసారి జట్ల హోం వేదికల విషయంలో కొన్ని కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాజస్థాన్ రాయల్స్ జట్టు గౌహతిలో తమ హోం మ్యాచ్‌లను ప్రారంభించనుండగా.. పంజాబ్ కింగ్స్ న్యూ చండీగఢ్.. ధర్మశాల వేదికలను ఎంచుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు బెంగళూరుతో పాటు రాయ్‌పూర్ నగరంలోనూ తమ హోం మ్యాచ్‌లను ఆడనుంది. ఏప్రిల్ 4న జరిగే తొలి డబుల్ హెడర్ మ్యాచ్‌లలో ఢిల్లీ క్యాపిటల్స్.. ముంబై ఇండియన్స్ ఢిల్లీలో తలపడగా.. గుజరాత్ టైటాన్స్.. రాజస్థాన్ రాయల్స్ జట్లు అహ్మదాబాద్‌లో ఢీకొనబోతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా పేరుగాంచిన ఐపీఎల్ ఈసారి కూడా అభిమానులను ఉర్రూతలూగించేందుకు సిద్ధమైంది.

| Date | Start | Home | Away | Venue |
|---|---|---|---|---|
| 28-MAR-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Sunrisers Hyderabad | Bengaluru |
| 29-MAR-26 | 7:30 PM | Mumbai Indians | Kolkata Knight Riders | Mumbai |
| 30-MAR-26 | 7:30 PM | Rajasthan Royals | Chennai Super Kings | Guwahati |
| 31-MAR-26 | 7:30 PM | Punjab Kings | Gujarat Titans | New Chandigarh |
| 01-APR-26 | 7:30 PM | Lucknow Super Giants | Delhi Capitals | Lucknow |
| 02-APR-26 | 7:30 PM | Kolkata Knight Riders | Sunrisers Hyderabad | Kolkata |
| 03-APR-26 | 7:30 PM | Chennai Super Kings | Punjab Kings | Chennai |
| 04-APR-26 | 3:30 PM | Delhi Capitals | Mumbai Indians | Delhi |
| 04-APR-26 | 7:30 PM | Gujarat Titans | Rajasthan Royals | Ahmedabad |
| 05-APR-26 | 3:30 PM | Sunrisers Hyderabad | Lucknow Super Giants | Hyderabad |
| 05-APR-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Chennai Super Kings | Bengaluru |
| 06-APR-26 | 7:30 PM | Kolkata Knight Riders | Punjab Kings | Kolkata |
| 07-APR-26 | 7:30 PM | Rajasthan Royals | Mumbai Indians | Guwahati |
| 08-APR-26 | 7:30 PM | Delhi Capitals | Gujarat Titans | Delhi |
| 09-APR-26 | 7:30 PM | Kolkata Knight Riders | Lucknow Super Giants | Kolkata |
| 10-APR-26 | 7:30 PM | Rajasthan Royals | Royal Challengers Bengaluru | Guwahati |
| 11-APR-26 | 3:30 PM | Punjab Kings | Sunrisers Hyderabad | New Chandigarh |
| 11-APR-26 | 7:30 PM | Chennai Super Kings | Delhi Capitals | Chennai |
| 12-APR-26 | 3:30 PM | Lucknow Super Giants | Gujarat Titans | Lucknow |
| 12-APR-26 | 7:30 PM | Mumbai Indians | Royal Challengers Bengaluru | Mumbai |
| 13-APR-26 | 7:30 PM | Sunrisers Hyderabad | Rajasthan Royals | Hyderabad |
| 14-APR-26 | 7:30 PM | Chennai Super Kings | Kolkata Knight Riders | Chennai |
| 15-APR-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Lucknow Super Giants | Bengaluru |
| 16-APR-26 | 7:30 PM | Mumbai Indians | Punjab Kings | Mumbai |
| 17-APR-26 | 7:30 PM | Gujarat Titans | Kolkata Knight Riders | Ahmedabad |
| 18-APR-26 | 3:30 PM | Royal Challengers Bengaluru | Delhi Capitals | Bengaluru |
| 18-APR-26 | 7:30 PM | Sunrisers Hyderabad | Chennai Super Kings | Hyderabad |
| 19-APR-26 | 3:30 PM | Kolkata Knight Riders | Rajasthan Royals | Kolkata |
| 19-APR-26 | 7:30 PM | Punjab Kings | Lucknow Super Giants | New Chandigarh |
| 20-APR-26 | 7:30 PM | Gujarat Titans | Mumbai Indians | Ahmedabad |
| 21-APR-26 | 7:30 PM | Sunrisers Hyderabad | Delhi Capitals | Hyderabad |
| 22-APR-26 | 7:30 PM | Lucknow Super Giants | Rajasthan Royals | Lucknow |
| 23-APR-26 | 7:30 PM | Mumbai Indians | Chennai Super Kings | Mumbai |
| 24-APR-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Gujarat Titans | Bengaluru |
| 25-APR-26 | 3:30 PM | Delhi Capitals | Punjab Kings | Delhi |
| 25-APR-26 | 7:30 PM | Rajasthan Royals | Sunrisers Hyderabad | Jaipur |
| 26-APR-26 | 3:30 PM | Gujarat Titans | Chennai Super Kings | Ahmedabad |
| 26-APR-26 | 7:30 PM | Lucknow Super Giants | Kolkata Knight Riders | Lucknow |
| 27-APR-26 | 7:30 PM | Delhi Capitals | Royal Challengers Bengaluru | Delhi |
| 28-APR-26 | 7:30 PM | Punjab Kings | Rajasthan Royals | New Chandigarh |
| 29-APR-26 | 7:30 PM | Mumbai Indians | Sunrisers Hyderabad | Mumbai |
| 30-APR-26 | 7:30 PM | Gujarat Titans | Royal Challengers Bengaluru | Ahmedabad |
| 01-MAY-26 | 7:30 PM | Rajasthan Royals | Delhi Capitals | Jaipur |
| 02-MAY-26 | 7:30 PM | Chennai Super Kings | Mumbai Indians | Chennai |
| 03-MAY-26 | 3:30 PM | Sunrisers Hyderabad | Kolkata Knight Riders | Hyderabad |
| 03-MAY-26 | 7:30 PM | Gujarat Titans | Punjab Kings | Ahmedabad |
| 04-MAY-26 | 7:30 PM | Mumbai Indians | Lucknow Super Giants | Mumbai |
| 05-MAY-26 | 7:30 PM | Delhi Capitals | Chennai Super Kings | Delhi |
| 06-MAY-26 | 7:30 PM | Sunrisers Hyderabad | Punjab Kings | Hyderabad |
| 07-MAY-26 | 7:30 PM | Lucknow Super Giants | Royal Challengers Bengaluru | Lucknow |
| 08-MAY-26 | 7:30 PM | Delhi Capitals | Kolkata Knight Riders | Delhi |
| 09-MAY-26 | 7:30 PM | Rajasthan Royals | Gujarat Titans | Jaipur |
| 10-MAY-26 | 3:30 PM | Chennai Super Kings | Lucknow Super Giants | Chennai |
| 10-MAY-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Mumbai Indians | Raipur |
| 11-MAY-26 | 7:30 PM | Punjab Kings | Delhi Capitals | Dharamshala |
| 12-MAY-26 | 7:30 PM | Gujarat Titans | Sunrisers Hyderabad | Ahmedabad |
| 13-MAY-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Kolkata Knight Riders | Raipur |
| 14-MAY-26 | 7:30 PM | Punjab Kings | Mumbai Indians | Dharamshala |
| 15-MAY-26 | 7:30 PM | Lucknow Super Giants | Chennai Super Kings | Lucknow |
| 16-MAY-26 | 7:30 PM | Kolkata Knight Riders | Gujarat Titans | Kolkata |
| 17-MAY-26 | 3:30 PM | Punjab Kings | Royal Challengers Bengaluru | Dharamshala |
| 17-MAY-26 | 7:30 PM | Delhi Capitals | Rajasthan Royals | Delhi |
| 18-MAY-26 | 7:30 PM | Chennai Super Kings | Sunrisers Hyderabad | Chennai |
| 19-MAY-26 | 7:30 PM | Rajasthan Royals | Lucknow Super Giants | Jaipur |
| 20-MAY-26 | 7:30 PM | Kolkata Knight Riders | Mumbai Indians | Kolkata |
| 21-MAY-26 | 7:30 PM | Chennai Super Kings | Gujarat Titans | Chennai |
| 22-MAY-26 | 7:30 PM | Sunrisers Hyderabad | Royal Challengers Bengaluru | Hyderabad |
| 23-MAY-26 | 7:30 PM | Lucknow Super Giants | Punjab Kings | Lucknow |
| 24-MAY-26 | 3:30 PM | Mumbai Indians | Rajasthan Royals | Mumbai |
| 24-MAY-26 | 7:30 PM | Kolkata Knight Riders | Delhi Capitals | Kolkata |

- తొలి పోరులో బెంగళూరుతో హైదరాబాద్ ఢీ!
- మార్చి 28 నుంచి మే 24 వరకు లీగ్ మ్యాచ్‌ల హోరు
- 70 మ్యాచ్‌లకు తేదీలు ఖరారు.. ప్లేఆఫ్స్ వేదికలపై సస్పెన్స్
- మే 24న కోల్‌కతా.. ఢిల్లీ మధ్య ఆఖరి లీగ్ ఫైట్

**హైదరాబాద్:** క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ పూర్తిస్థాయి షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) విడుదల చేసింది. తొలుత కేవలం ఇరవై మ్యాచ్‌లకు మాత్రమే తేదీలు.. వేదికలను ప్రకటించిన బోర్డు.. తాజాగా మిగిలిన యాభై మ్యాచ్‌ల వివరాలను కూడా వెల్లడించింది. దీంతో మొత్తం డెబ్బై లీగ్ మ్యాచ్‌ల షెడ్యూల్ ఖరారైంది. అయితే ప్లేఆఫ్స్.. ఫైనల్ మ్యాచ్‌ల వేదికలను మాత్రం బోర్డు ఇంకా ప్రకటించలేదు.

### తొలి పోరు.. దక్కన్ డెర్బీ

మార్చి 28 నుంచి మే 24 వరకు దేశవ్యాప్తంగా క్రికెట్ ఫీవర్ నడవనుంది. ఈ మెగా టోర్నీలో మొత్తం డెబ్బై లీగ్ మ్యాచ్‌లు జరగనుండగా.. ప్రతి జట్టు సగం మ్యాచ్‌లు సొంత మైదానంలో.. మిగతా సగం ప్రత్యర్థి మైదానంలో ఆడనున్నాయి. వారాంతాలైన శని.. ఆదివారాల్లో అభిమానులను అలరించేందుకు రోజుకు రెండు మ్యాచ్‌లు నిర్వహించేలా మధ్యాహ్నం.. రాత్రి వేళల్లో షెడ్యూల్ రూపొందించారు. బెంగళూరు వేదికగా మార్చి 28న జరిగే తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. రెండు జట్లలోనూ విధ్వంసకర ఆటగాళ్లు ఉండటంతో ఆరంభ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. హైదరాబాద్ జట్టు గత సీజన్ల అనుభవాలతో.. బౌలింగ్.. బ్యాటింగ్ విభాగాల్లో వ్యూహాత్మకంగా ఎలా బరిలోకి దిగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

### జట్ల ముందున్న సవాళ్లు

లీగ్ దశ ఆఖరి మ్యాచ్ మే 24న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్.. ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగనుంది. ఈసారి వేసవి కాలం దృష్ట్యా ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం ఉండటంతో ఆటగాళ్ల ఫిట్‌నెస్ జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషించనుంది. వరుస ప్రయాణాల బడలికను అధిగమిస్తూ.. సొంత మైదానాల్లో దొరికే పిచ్.. వాతావరణ అనుకూలతను ఏ జట్టు మెరుగ్గా సద్వినియోగం చేసుకుంటుందో ఆ జట్టే ప్లేఆఫ్స్‌కు చేరే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. స్పిన్నర్లకు అనుకూలించే పిచ్‌లపై ఆయా జట్ల వ్యూహాలే పాయింట్ల పట్టికను శాసించనున్నాయి.





# కోలుకుంటున్న కమిన్స్!

## సన్‌రైజర్స్ ఫ్యాన్స్‌కు తీపి కబురు

## త్వరలోనే మైదానంలోకి దిగనున్న సన్‌రైజర్స్ కెప్టెన్

**ముంబై:** ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త అందింది. వెన్ను గాయంతో కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న జట్టు సారథి పాట్ కమిన్స్ వేగంగా కోలుకుంటున్నారు. మార్చి 25న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన శిక్షణలో ఆయన పాల్గొనడం అభిమానులకు పెద్ద ఊరటనిచ్చింది. తాను వేగంగా కోలుకుంటున్నానని.. టోర్నీ మధ్యలో కచ్చితంగా జట్టులోకి వస్తానని కమిన్స్ ధీమా వ్యక్తం చేశారు. వెన్ను గాయం కారణంగా గత కొంతకాలంగా క్రికెట్‌కు దూరమైన కమిన్స్.. ప్రస్తుతం తేలికపాటి వ్యాయామాలకే పరిమితమయ్యారు. ఫీల్డింగ్.. క్యాచ్‌లు పట్టే డ్రిల్స్‌తో పాటు వార్మప్ ఎక్సర్‌సైజులలో చురుగ్గా పాల్గొన్నారు. తన బౌలింగ్ లయను తిరిగి పొందేందుకు తక్కువ రన్ అప్‌తో కొన్ని బంతులు వేశారు. కమిన్స్ కోలుకుంటున్న తీరు జట్టు యాజమాన్యంలో ఆశలు చిగురింపజేస్తోంది. గత ఏడాది ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు మ్యాచ్




తర్వాత ఆయన గాయాల కారణంగా వరుసగా మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లకు తాను అందుబాటులో ఉండటం లేదని కమిన్స్ స్పష్టం చేశారు. అయితే టోర్నీ రెండో సగం నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించి మైదానంలోకి దిగుతానని వెల్లడించారు. అంతా అనుకున్నట్లు జరిగితే కీలకమైన ఫైనల్స్ సమయంలో జట్టును నడిపిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రతి మూడు రోజులకు ఒకసారి బౌలింగ్ చేస్తూ తన శరీరాన్ని మ్యాచ్‌లకు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### సారథిగా ఇషాన్ కిషన్

కమిన్స్ అందుబాటులో లేని సమయంలో సన్‌రైజర్స్ జట్టు పగ్గాలను వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ చేపట్టనున్నారు. తాత్కాలిక కెప్టెన్‌గా కిషన్ బాధ్యతలు తీసుకోవడం జట్టుకు కీలకం కానుంది. ప్రారంభ మ్యాచ్‌లలో జట్టును విజయపథంలో నడిపించే బాధ్యత ఇప్పుడు కిషన్ భుజాలపై పడింది. కమిన్స్ తిరిగి వచ్చే వరకు జట్టు సమతుల్యత దెబ్బతినకుండా చూడటమే కిషన్ ముందున్న ప్రధాన లక్ష్యం.

## భారత్ 'హోం' సీజన్ షెడ్యూల్ ఖరారు

## వెస్టిండీస్.. శ్రీలంక.. జింబాబ్వే.. ఆస్ట్రేలియా జట్లకు ఆతిథ్యం

## 17 నగరాల్లో 22 అంతర్జాతీయ మ్యాచ్‌ల సందడి

# స్వదేశంలో క్రికెట్ పండుగ!

**ఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 2026-27 సంవత్సరానికి సంబంధించి భారత పురుషుల జట్టు అంతర్జాతీయ హోం సీజన్ షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈ సీజన్‌లో టీమ్ ఇండియా వెస్టిండీస్.. శ్రీలంక.. జింబాబ్వే.. ఆస్ట్రేలియా జట్లకు ఆతిథ్యం ఇవ్వనుంది. మొత్తం 17 నగరాల్లో 22 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సుదీర్ఘ సీజన్ సెప్టెంబర్ 27న వెస్టిండీస్ పర్యటనతో అట్టహాసంగా ప్రారంభం కానుంది.

### వెస్టిండీస్‌తో పోరుతో ఆరంభం

వెస్టిండీస్ జట్టు భారత పర్యటనలో మూడు వన్డేలు.. ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. తొలి వన్డే సెప్టెంబర్ 27న తిరువనంతపురంలో.. రెండో వన్డే సెప్టెంబర్ 30న గౌహతిలో.. మూడో వన్డే అక్టోబర్ 3న న్యూ చండీగఢ్‌లో జరుగుతాయి. అనంతరం టీ20ల హోరు మొదలవుతుంది. అక్టోబర్ 6న లక్నో.. 9న రాంచీ.. 11న ఇండోర్.. 14న హైదరాబాద్.. 17న బెంగళూరు వేదికలుగా ఈ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. కరీబియన్ వీరులతో జరిగే ఈ పోరు అభిమానులకు అసలైన వినోదాన్ని పంచనుంది.

### శ్రీలంక.. జింబాబ్వే జట్ల రాక


వెస్టిండీస్ సిరీస్ ముగిసిన తర్వాత డిసెంబర్ నెలలో శ్రీలంక జట్టు భారత్‌కు రానుంది. లంకతో మూడు వన్డేలు.. మూడు టీ20ల సిరీస్ ఉంటుంది. డిసెంబర్ 13న ఢిల్లీ.. 16న బెంగళూరు.. 19న అహ్మదాబాద్‌లలో వన్డే మ్యాచ్‌లు జరుగుతాయి. టీ20 మ్యాచ్‌లు డిసెంబర్ 22న రాజ్‌కోట్.. 24న కటక్.. 27న పుణేలో నిర్వహిస్తారు. ఆ తర్వాత 2027 జనవరి ప్రారంభంలో జింబాబ్వే జట్టు మూడు వన్డేల కోసం రానుంది. జనవరి 3న కోల్‌కతా.. 6న హైదరాబాద్.. 9న ముంబై నగరాల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి.

### బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సమరం

ఈ హోం సీజన్‌కు తుది ఘట్టంగా ప్రతిష్టాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ జరగనుంది. భారత్.. ఆస్ట్రేలియా జట్ల మధ్య ఐదు టెస్టుల ఈ సిరీస్ జనవరి 21న నాగ్‌పూర్‌లో ప్రారంభమవుతుంది. రెండో టెస్ట్ జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు చెన్నైలో.. మూడో టెస్ట్ ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు గౌహతిలో.. నాలుగో టెస్ట్ ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు రాంచీలో.. చివరిదైన ఐదో టెస్ట్ ఫిబ్రవరి 27 నుంచి మార్చి 3 వరకు అహ్మదాబాద్ వేదికగా నిర్వహిస్తారు. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ఆసక్తి రేకెత్తించే ఈ టెస్ట్ సిరీస్‌తో భారత హోం సీజన్ ముగుస్తుంది.



Printed, Published and Owned by MOHAMMAD ABDUL RAHEMAN, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273 Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717





# బ్యాండ్ మేళం.. శృతి తప్పిన వినోదం!

'కోర్ట్' చిత్రంతో ఆకట్టుకున్న జంట హర్ష రోషన్, శ్రీదేవి ప్రధాన పాత్రల్లో, ప్రముఖ రచయిత కోన వెంకట్ నిర్మాణంలో వచ్చిన తాజా చిత్రం 'బ్యాండ్ మేళం'. బావ-మరదళ్ల పాత ప్రేమకథా నేపథ్యంతో సాగే ఈ సినిమా వివరాలు మీ కోసం.. గిరి (హర్ష రోషన్) చదువు మధ్యలో మానేసి, సంగీత దర్శకుడు అవ్వాలనే లక్ష్యంతో ఒక బ్యాండ్ బృందాన్ని నడుపుతుంటాడు. గిరి మరదలు రాజీ (శ్రీదేవి) చదువులో టాపర్. చిన్నప్పుడే వీరికి పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించినా, గిరి లక్ష్యం లేని ప్రవర్తన వల్ల రాజీ అతడిని దూరం పెడుతుంది. ఈ క్రమంలో రాజీ తండ్రి సాయన్న (సాయికుమార్) ఆమెకు మరో పెళ్లి సంబంధం నిశ్చయిస్తాడు. మరి గిరి తన మరదలు మనసు గెలిచి, తన సంగీత కలను ఎలా నెరవేర్చుకున్నాడు అనేదే మిగతా కథ. తెలుగు తెరకు బావ-మరదళ్ల కథలు కొత్తేమీ కాదు. అయితే, అరిగిపోయిన పాత కథనే మళ్ళీ ఎటువంటి కొత్తదనం లేకుండా చూపించడంతో 'బ్యాండ్ మేళం' విఫలమైంది. బలహీనమైన సన్నివేశాలు, ఆసక్తి కలిగించని పాత్రలతో సినిమా ఆద్యంతం బోరింగ్‌గా సాగుతుంది. 'కోర్ట్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న హర్ష రోషన్, శ్రీదేవిల జంటను ఈ సినిమాలో సరైన రీతిలో వాడుకోవడంలో మేకర్స్ విఫలమయ్యారు. ముఖ్యంగా పాత్రలు మాట్లాడే తెలంగాణ యాస ఎక్కడా సహజంగా అనిపించదు. హర్ష రోషన్ నటన కొన్ని చోట్ల శృతి మించినట్లుగా అనిపిస్తుంది. డైలాగ్ డెలివరీలో సహజత్వం లోపించింది. శ్రీదేవి పాత్ర కూడా అంతగా ఆకట్టుకోదు. విజయ్ బుల్గానిన్ సంగీతం ఆయన మార్కులో లేదు. రచయితగా ఎన్నో హిట్ చిత్రాలకు కథలందించిన కోన వెంకట్, ఇలాంటి నాసిరకం కథను ఎంచుకోవడం ఆశ్చర్యకరం. దర్శకుడు సతీష్ జవ్వాజి ఏ విషయంలోనూ తన ప్రతిభను చాటుకోలేకపోయారు. మొత్తానికి, 'బ్యాండ్ మేళం' కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు నిరాశనే మిగులుస్తుంది.

# ఉస్తాద్‌లో పవన్ కళ్యాణ్ ఎంట్రీ అదుర్స్

## ప్రేక్షకుల స్పందనపై హరీష్ కామెంట్స్


పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'సినిమాలో పవన్ ఎంట్రీ సీన్‌పై సోషల్ మీడియాలో వచ్చిన ట్రోల్స్‌పై హరీశ్ శంకర్ స్పందించారు. ఆయన జీప్‌లో నుంచి రెండుసార్లు దిగడం ఒకే సీన్‌లో చూపించారని కొందరు విమర్శించారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ తనకు రెండు ఎంట్రీలు నచ్చాయని అందుకే పెట్టినట్లు తెలిపారు. కొన్నికొన్ని సన్నివేశాల్లో స్వేచ్ఛ తీసుకుంటా. ఉస్తాద్ భగత్ సింగ్‌లో పవన్ (ఖజీలిజీని ఐజీ÷ూజీని) ఫస్ట్ జీప్‌లో నుంచి దిగుతారు. ఆ సమయంలో ఒక బాడీ పడుతుంటే ఆయన దిగడం చూపించా. ఆ తర్వాత మళ్లీ జీప్ నుంచి జంప్ చేస్తూ కిందకు వస్తారు. ఇదేంటి రెండుసార్లు ఎలా దిగారని కొందరు అన్నారు. అలాంటివి పట్టించుకోను. నాకు రెండు షాట్లూ నచ్చాయి. నేను ఒక షాట్ తీశా. మాస్టర్ ఇంకోటి తీశారు. రెండూ బాగున్నాయి అనిపించింది. నచ్చాయి అంటే లాజిక్‌లను పట్టించుకోను. 'ధురంధర్ 2' కలెక్షన్స్ చూసి నాకు కూడా ఆనందంగానే ఉంది. మీరు గమనిస్తే.. నేను ఉస్తాద్‌లో చూపించిన దేశభక్తిని ఆదిత్యధర్ పూర్తిస్థాయిలో 'ధురంధర్ 2'లో చూపించారు. నా భావాలతో నాకు నచ్చిన సినిమా.. నా చిత్రం కంటే బాగా హిట్ అవుతోంది అన్నప్పుడు ఒకరకమైన ఆనందం ఉంటుంది కదా.. నేను ఇప్పుడు అదే సంతోషంలో ఉన్నాను. మనమందరం సినిమా లవర్స్. ఏ సినిమా విజయం



సాధించినా ఆనందమే. ఇన్నేళ్ల నా కెరీర్‌లో చాలా తక్కువ సినిమాలు చేశాను. నేను తొమ్మిది సినిమాలు చేస్తే.. దాదాపు 10 చిత్రాలు క్యాన్సిల్ చేశా. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. స్క్రిప్ట్ కుదరకపోవడం, హీరో చివరి నిమిషంలో క్యాన్సిల్ చేయడం.. ఇలా ఎన్నో ప్రాజెక్ట్‌లు చేయలేకపోయా. ఎన్టీఆర్‌తో 'ఎంఎల్ఏ' చేద్దాం అనుకున్నా. కానీ, కుదర్లేదు. క్యాన్సిల్ అయిన ప్రాజెక్ట్‌లకు వర్క్ చేసి కూడా పట్టాలెక్కించలేకపోయా. ఇకనుంచి అలా జరగదు. చాలా కథలు రాసుకున్నా. వరుసగా తెరకెక్కిస్తాను.

# వివేక్ అగ్నిహోత్రి కొత్త చిత్రం 'ఆపరేషన్ సిందూర్' ప్రకటన

'ది కాశ్మీర్ ఫైల్స్', 'ది వ్యాక్సిన్ వార్' వంటి వివాదాస్పద చిత్రాలతో సంచలనం సృష్టించిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తన కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. 'ఆపరేషన్ సిందూర్' అనే టైటిల్‌తో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్ (టి-సిరీస్)తో కలిసి అగ్నిహోత్రి పనిచేస్తున్నారు. రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ 'టైనీ' ధిల్లాన్ రచించిన పుస్తకాన్ని ఆధారంగా చేసుకుని సినిమా రూపొందించబడుతోంది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత జరిగిన పరిణామాలు, భారత సాయుధ దళాల సమన్వయ చర్యలు ఈ కథలో ప్రధానాంశాలుగా ఉండనున్నాయి. సోషల్ మీడియాలో స్పందించిన వివేక్ అగ్నిహోత్రి, "కేవలం సంచలనం కోసం కాకుండా, నిజాలను స్పష్టంగా చూపించడం మా లక్ష్యం" అని తెలిపారు. ఈ చిత్రాన్ని పల్లవి జోషి, వివేక్ అగ్నిహోత్రి కలిసి 'ఐ యామ్ బుద్ధ' ప్రొడక్షన్స్ బ్యానర్‌పై, టి-సిరీస్‌తో భాగస్వామ్యంగా నిర్మిస్తున్నారు.






# విడాకుల వార్తలకు చెక్

## బంధంపై ప్రియాంక చోప్రా క్లారిటీ

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా తన వైవాహిక జీవితంపై వస్తున్న నెగటివ్ ప్రచారానికి గట్టిగా చెక్ పెట్టారు. భర్త నిక్ జోనాస్తో విడిపోతున్నారంటూ వస్తున్న వార్తలను పూర్తిగా ఖండించారు. ఇవన్నీ కల్పిత కథలేనని, దేశం, మతం, వయసు వంటి అంశాలను సాకుగా చూపి కొందరు విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం ఆరు నెలల పరిచయంతోనే పెళ్లి చేసుకున్నప్పటికీ, తమ మధ్య ఉన్న పరస్పర గౌరవం, నిక్ చూపే నిజాయతీ తమ ఎనిమిదేళ్ల ప్రయాణాన్ని ఎంతో మధురంగా మార్చాయని ప్రియాంక తెలిపారు. బయటి వ్యక్తుల అభిప్రాయాలు తమ బంధాన్ని ఎప్పటికీ ప్రభావితం చేయవని స్పష్టం చేశారు. తన కుమార్తె మాల్తీ మేరీ ప్రైవసీ విషయంలో తాను చాలా కఠినంగా ఉంటానని ప్రియాంక వెల్లడించారు. అనుమతి లేకుండా ఫొటోలు తీయడం, సోషల్ మీడియాలో వైరల్ చేయడం తనకు ఇష్టముండదని, బిడ్డ భద్రత కోసం ప్రత్యేక సెక్యూరిటీ ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. 30 ఏళ్ల వయసులో బాలీవుడ్‌లో టాప్ పొజిషన్‌లో ఉండి కూడా, అన్నీ వదిలేసి హాలీవుడ్‌లో సున్నా నుంచి ప్రారంభించడం ఒక పెద్ద సాహసమని ఆమె గుర్తుచేసుకున్నారు. మొదట్లో చిన్న పాత్రలే వచ్చినప్పటికీ, పట్టుదలతో ముందుకు సాగి ఇప్పుడు తనకు నచ్చిన ప్రాజెక్టులను ఎంచుకునే స్థాయికి చేరుకున్నానని ప్రియాంక చోప్రా తెలిపారు.

# పేదల సొంతింటి కల సాకారం..

**ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం**



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల పరిధిలోని కోంట్రోనిపల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం పండుగలా నిర్వహించబడింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కుంభం శివకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డితో కలిసి ఆయన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పి.సుధాకర్ ఆధ్వర్యంలో కుంభం శివకుమార్ రెడ్డిని శాలువాలు, పూలమాలలతో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. పేదలకు గూడు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేస్తామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ మాధవరెడ్డి, మండల అధ్యక్షులు నరహరి, మాజీ అధ్యక్షులు సుదర్శన్, ఉప సర్పంచ్ ఆంజనేయులు, వార్డు సభ్యులు మాధవి, రఘు, భాగ్యమ్మ, మొగులయ్య, లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, హౌసింగ్ ఏఈ జయన్న, నాయకులు బలరాం, గోపాల్, రహీంఖాన్, రవీంద్రరావు, భూపాల్ మరియు ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బోయకొండ గంగమ్మకు రూ. 35.33 లక్షల ఆదాయం

**10 గ్రాముల బంగారం సమర్పణ**



**నేటి సాక్షి, చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గత 31 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకల ద్వారా అమ్మవారికి రూ. 35,33,848 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ ఏకాంబరం వెల్లడించారు. నగదుతో పాటు భక్తులు 10 గ్రాముల బంగారం, 136 గ్రాముల వెండిని కానుకలుగా సమర్పించారని ఆయన వివరించారు. అలాగే అన్నదాన హుండీ ద్వారా రూ. 12,444, రణభేరి గంగమ్మ ఆలయ హుండీ ద్వారా రూ. 22,655 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మేడారం పనుల్లో నాణ్యత లోపం

**మంత్రి సీతక్క రాజీనామా చేయాలి**



**నేటి సాక్షి, ములుగు:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మేడారంలో రూ. 251 కోట్లతో చేపట్టిన ఆలయ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పూర్తిగా లోపించాయని లంబాడీ న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు దారావత్ దేవా నాయక్ విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన పనులు నాసిరకంగా ఉండటం వల్లనే నిర్మించిన రెండు నెలలకే రాతి కట్టడాలు కూలి ఒక బాలుడి ప్రాణాల మీదకు వచ్చిందని మండిపడ్డారు. 16వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించిన రామప్ప, వేయి స్తంభాల గుడి వంటివి ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, కానీ నేటి పాలనలో మేడారం పనులు బూడిదలో పోసిన పన్నీరులా మారాయని దేవా నాయక్ ధ్వజమెత్తారు. ఈ ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గాయపడిన బాలుడికి అయ్యే పూర్తి చికిత్స ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, నాసిరకం పనులపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# వైభవంగా 'జోగు' కార్యక్రమం

**గౌడ సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికీ ఎల్లమ్మ తల్లి సిద్ధోగం**



**నేటి సాక్షి గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ ఎల్లమ్మ సిద్ధోగం జాతర ఉత్సాహంగా సాగుతోంది. జాతరలో భాగంగా రెండో రోజైన గురువారం గౌడ కులస్థుల ఇంటింటికీ కులదైవమైన శ్రీ ఎల్లమ్మ తల్లి 'జోగు' తిరిగే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం మండల అధ్యక్షుడు బుర్ర తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.. జాతరలో భాగంగా ఈనెల 29న పోచమ్మ బోనాలు, 31న ఉదయం పుట్ట బంగారం మరియు ఎల్లమ్మ బోనాలు ఉంటాయని తెలిపారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు రేణుక ఎల్లమ్మ – జమదగ్ని మునిరాజుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఏప్రిల్ 1న నాగవెల్లి పట్నం బోనాలతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బుర్ర తిరుపతి గౌడ్, చిన్న తిరుపతి గౌడ్, శ్రీధర్ గౌడ్, మల్లేశం గౌడ్, రాజయ్య గౌడ్, నరేష్ గౌడ్, రమణ గౌడ్, కందాల నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిరణ్ సాగర్ రావు

- భారీ మెజార్టీతో ఘన విజయం.. ప్రత్యర్థి బత్తుల రాజుపై 52 ఓట్లతో గెలుపు
- న్యాయవాదుల సంక్షేమమే నా ధ్యేయం నూతన అధ్యక్షుడు కిరణ్ సాగర్ రావు



**నేటి సాక్షి, గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం కోర్టు ప్రాంగణంలో శాంతియుతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి కిరణ్ సాగర్ రావు, బత్తుల రాజు పోటీ పడగా.. కిరణ్ సాగర్ రావు 52 ఓట్లు సాధించి ఘన విజయం సాధించారు. ప్రత్యర్థి బత్తుల రాజుకు కేవలం 18 ఓట్లు మాత్రమే లభించాయి. మొత్తం 78 మంది సభ్యులకు గాను మెజార్టీ ఓట్లు సాధించిన కిరణ్ సాగర్ రావును ఎన్నికల అధికారులు విజేతగా ప్రకటించారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

ఫలితాల అనంతరం కిరణ్ సాగర్ రావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్‌లో మౌలిక వసతుల కల్పన, సభ్యుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. న్యాయవాదుల ఐక్యతతో అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కోర్టు ప్రాంగణంలో మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

# నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు



- ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం అభినందనీయం
- డైరెక్టర్ గుమ్మడి సోమయ్య

**నేటి సాక్షి, ములుగు:** విద్యార్థుల ఆరోగ్యం, విద్యా సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం 2026–27 విద్యా సంవత్సరం నుండి రెండు కీలక పోషకాహార పథకాలను ప్రవేశపెట్టడం గొప్ప విషయమని పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య అన్నారు. గురువారం ములుగు జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. ప్రీ–ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు "బ్రేక్‌ఫాస్ట్ పథకం" కింద ప్రతిరోజూ అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావ ఇస్తారని పేర్కొన్నారు. అలాగే, ఇప్పటివరకు పాఠశాలలకే పరిమితమైన "మధ్యాహ్న భోజన పథకాన్ని" ఇకపై ప్రభుత్వ జూనియర్ కళాశాలల వరకు విస్తరించనున్నట్లు వివరించారు. ఈ చర్యల వల్ల పేద విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, పోషకాహార లోపం నివారించవచ్చని, డ్రాపౌట్ రేటు కూడా తగ్గుతుందని సోమయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేషనల్ హాకథాన్‌లో 'జ్యోతిష్మతి' విద్యార్థుల ప్రతిభ

- జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి.. చైర్మన్ జువ్వాడి సాగర్ రావు హర్షం
- 'గ్రీన్ జీన్' ప్రాజెక్టుకు నగదు పురస్కారం.. విజేతలకు అభినందనలు



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** హైదరాబాద్‌లోని రిషి ఎంఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక పోటీల్లో తిమ్మాపూర్ జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు గురువారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు.

మొదటి బహుమతి: థర్డ్ ఇయర్ సీఎస్ఈ విద్యార్థులు తాళ్లపల్లి భవాని, వైష్ణవి చక్రవర్తుల, షిఫా తస్ట్రీమ్ 'ఇగ్నైట్ టూ స్కేల్' పోటీల్లో 'గ్రీన్ జీన్' ప్రాజెక్టును ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు రూ. 5,000 నగదు బహుమతిని గెలుచుకున్నారు.

రన్నరప్: గీతం యూనివర్సిటీలో జరిగిన 'ప్రొటోవర్స్' ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో సెకండియర్ సీఎస్ఈ విద్యార్థులు మొహమ్మద్ యాసీన్, మొహమ్మద్ అమాన్ నిహాల్, గాజియా సిద్దికీ, కే. హర్షిని రన్నరప్‌గా నిలిచి రూ. 3,000 నగదు బహుమతి పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల సెక్రటరీ జే. సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డా. టీ. అనిల్ కుమార్, డీన్ డా. పీ.కే. వైషాలి మరియు విభాగాధిపతులు ప్రత్యేకంగా అభినందించారు.

# మల్లూరు లక్ష్మీనృసింహుని ఆలయ అభివృద్ధికి 'మాస్టర్ ప్లాన్'




- భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.
- ప్రధాన ఆర్చి, రోడ్డు విస్తరణ, కల్యాణ మండప నిర్మాణాలపై అధికారులకు ఆదేశం

**నేటి సాక్షి, ములుగు:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లూరు హేమాచల శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ అభివృద్ధికి తక్షణమే మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఆలయాన్ని సందర్శించి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన వసతులపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శ్రీ లక్ష్మీనృసింహ స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి అమ్మవార్ల దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. ప్రధాన ఆర్చి నిర్మాణం, రోడ్డు విస్తరణ, కల్యాణ కట్ట, కల్యాణ మండపం, వాహనాల పార్కింగ్ స్థలాల ఏర్పాటుపై త్వరితగతిన నివేదికలు రూపొందించాలని సూచించారు. ఆచార సాంప్రదాయాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్కిటెక్ట్ బృందం, దేవాదాయ శాఖ డీఈ రమేష్ బాబు, తహసీల్దార్ తోట రవీందర్, ఆలయ ఈవో మహేష్, ఎంపీడీవో బద్రు నాయక్, అర్చకులు ఈశ్వర్ చంద్ శర్మ, మాజీ చైర్మన్ యర్రంగారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మామిడి సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

- రాయితీతో కూడిన మామిడి కాయల కవర్ల పంపిణీ: గువ్వల రమేష్ రెడ్డి
- కీటకాల నుంచి రక్షణ.. నాణ్యమైన దిగుబడికి మార్గం
- ఎంపీడీవో లీలా మాధవి



**నేటి సాక్షి, చౌడేపల్లి:** చౌడేపల్లి మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 'సమగ్ర పంటల దిగుబడి అభివృద్ధి' రైతు శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి (చిట్టి) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ అనంతరం రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీతో కూడిన మామిడి కాయల కవర్లను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీ పథకాలను రైతులు ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మామిడి కాయలకు కవర్లు తొడగడం వల్ల దోమలు, కీటకాల నుండి రక్షణ లభిస్తుందని, కాయలు దెబ్బతినకుండా నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు. తద్వారా మార్కెట్‌లో మంచి ధర లభించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లీలా మాధవి, సంతోషి కుమారి, మండల నాయకులు బోయకొండ సుబ్బు, చంద్రమౌళి, విజయ భాస్కర్, హమీద్ ఖాన్, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

**రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన పవన్ కుమార్**



**నేటి సాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** కరీంనగర్ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో టి. పవన్ కుమార్ గురువారం గన్నేరువరం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలకు సంబంధించిన రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పనితీరును సమీక్షించిన అనంతరం పవన్ కుమార్ మాట్లాడుతూ.. కార్యాలయ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సూపరింటెండెంట్ వరప్రసాద్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (MPDO) శ్రీనివాస్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి (MPO) సురేందర్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు శ్రీ సీతారాముల కళ్యాణం

**అభిజిత్ లగ్నంలో సీతారాముల ఉత్సవం.. ఏర్పాట్లు పూర్తి**




**నేటి సాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. లోక కళ్యాణం కోసం నిర్వహించే ఈ వేడుకకు సంబంధించి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నేడు ఉదయం 11 గంటల 52 నిమిషాలకు పునర్వసు నక్షత్ర యుక్త అభిజిత్ కర్కాటక లగ్న పుష్కరాంశమునందు స్వామివారి కళ్యాణాన్ని జరపనున్నట్లు అర్చకులు తెలిపారు. ఈ పవిత్ర వేడుకను వీక్షించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భగవంతుని ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కోరింది. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు మరియు అన్న ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు.

# పుట్టినరోజున అన్నదానం

**కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 100 మందికి భోజన వితరణ**




**నేటి సాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలానికి చెందిన పరకాల స్వప్న-శ్రీనివాస్ దంపతులు తమ కుమార్తె 15వ పుట్టినరోజును పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సుమారు 100 మంది పేద ప్రజలకు, రోగుల బంధువులకు మరియు వృద్ధులకు గురువారం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు స్వప్న-శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ కుమార్తె జన్మదినం సందర్భంగా ఆడంబరాలకు పోకుండా పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం పుట్టినరోజు వేళ పేదలకు, అనాథలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ ప్రసన్న, స్నేహితులు లాస్య, వైష్ణవి, మధుప్రియ, అక్షర, ప్రవీణ్య, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డి బాటలో 'గుండాటి' దంపతులు

**ఏఎంసీ చైర్మన్ పదవికి, కాంగ్రెస్‌కు జితేందర్ రెడ్డి రాజీనామా**



**నేటి సాక్షి, ఎండపల్లి:** మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన అనుచరుల రాజీనామాల పరంపర కొనసాగుతోంది. జీవన్ రెడ్డికి మద్దతుగా ఉమ్మడి వెల్గటూర్ మండల మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండాటి గోపిక - జితేందర్ రెడ్డి దంపతులు తమ పదవులకు, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన జీవన్ రెడ్డి పట్ల పార్టీలో వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. ఆయన గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న పరిస్థితుల్లో తాము పార్టీలో కొనసాగలేమని స్పష్టం చేశారు. బుధవారం జీవన్ రెడ్డి నిర్వహించిన కార్యకర్తల సమావేశం నిర్ణయం మేరకే ఈ రాజీనామాలు సమర్పించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో జీవన్ రెడ్డి తీసుకునే ఏ నిర్ణయానికైనా తాము కట్టుబడి ఉంటామని, ఆయన వెంటే నడుస్తామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు.

# గుడాల శ్రీనివాస్‌కు 'కలం రత్న' పురస్కారం

- జర్నలిజంలో విశిష్ట సేవలకు దక్కిన అరుదైన గౌరవం
- రవీంద్రభారతిలో అవార్డు ప్రధానం.. డబ్ల్యుజేఐ నాయకుల అభినందనలు

**నేటి సాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** పత్రికా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుజేఐ) కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, గన్నేరువరం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుడాల శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మకమైన 'కలం రత్న' పురస్కారం లభించింది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్, వసుంధర విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి చేతుల మీదుగా శ్రీనివాస్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. సమాజ సమస్యలను వెలికితీయడంలో ఆయన చూపిస్తున్న చొరవ, జర్నలిస్టుల సంక్షేమం కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కార్పొరేటర్ దేవనపల్లి చక్రపాణి, టీఆర్ఎస్ నాయకులు నాలేశ్వరం శంకర్ తదితరులు శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. డబ్ల్యుజేఐ రాష్ట్ర అధ్యక్షుడు రానా ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ సహా జిల్లా, మండల స్థాయి నాయకులు, సర్పంచులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఒక మండల స్థాయి జర్నలిస్టుకు రాష్ట్ర స్థాయి వేదికపై పురస్కారం లభించడం పట్ల గన్నేరువరం జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

# గురుకుల పోరులో 'సర్కారీ' విద్యార్థుల జైత్రయాత్ర

- నల్లబెల్లి, బోలోనిపల్లి పాఠశాలల నుండి 14 మంది ఎంపిక
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య.. ప్రతిభ చాటిన చిన్నారులకు అభినందనలు



**నేటి సాక్షి, నల్లబెల్లి:** ఇటీవల విడుదలైన గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షా ఫలితాల్లో నల్లబెల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఎలాంటి ప్రత్యేక కోచింగ్ లేకుండానే కేవలం పాఠశాల ఉపాధ్యాయుల బోధనతోనే అత్యుత్తమ ర్యాంకులు సాధించి గురుకులాలకు ఎంపికయ్యారు. నల్లబెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు (మనస్విత్, గౌతమ్ నంద, లాస్య, అఖిరనందన్, వరుణ్, అభిజ్ఞ) గురుకుల ప్రవేశానికి అర్హత సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు రవీందర్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. అర్షనపల్లి శివారు బోలోనిపల్లి ప్రభుత్వ పాఠశాల నుండి ఏకంగా 8 మంది విద్యార్థులు (హాన్విక, హరి చందన, అనుశ్రీ, చిట్టి, జ్వాలాముఖి, తిరుమల, చిరునిధి, జస్వంత్) ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిద్ధ సంతోష్, హెచ్ఎం వి.శారద ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను సన్మానించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల కృషితోనే ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు వస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు.

# ఎన్టీఆర్ ఏ ఒక్కరివాడో కాదు.. అందరివాడు

- విగ్రహావిష్కరణను అడ్డుకుంటామనడం విడ్డూరం: అయ్యోరి యాణయ్య
- తెలుగు జాతి గర్వించదగ్గ మహానాయకుడు.. ఆదివాసీ నేతల హితవు



**నేటి సాక్షి, ములుగు:** మాజీ ముఖ్యమంత్రి, యుగపురుషుడు నందమూరి తారక రామారావు ఏ ఒక్క కులానికో, వర్గానికో చెందిన వాడు కాదని, ఆయన తెలుగు వారందరివాడని ఆదివాసీ గిరిజన నాయకుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యాణయ్య స్పష్టం చేశారు. గురువారం మండల కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గంపోనిగూడెం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణను అడ్డుకుంటామనడం సరికాదని హితవు పలికారు. తెలుగు ప్రజలకు రాజకీయ ఓనమాలు నేర్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని యాణయ్య కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల అభివృద్ధి కోసం 9 ఐటీడీఏ (ITDA)లను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనని గుర్తు చేశారు. పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం అందించి, పూరి గుడిసెలను తొలగించి పెంకుటిళ్లు నిర్మించిన ఆరాధ్య దైవమని పేర్కొన్నారు. ఇలాంటి మహనీయుడి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే అడ్డుకుంటామని పిచ్చి కూతలు కూయడం అర్థరహితమని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విగ్రహాలు పెట్టవద్దని కొందరు గిరిజన, ఆదివాసీ సంఘాల పేరుతో అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, చట్టాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మహనీయుల విగ్రహాల విషయంలో రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, మాజీ ఎంపీటీసీ కొమురం సారయ్య, బడిశా ఆదినారాయణ, కొమురం బాలన్న, పోదెం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లి బస్టాండ్‌లో 'హనుమాన్' విగ్రహ వివాదం





**నేటి సాక్షి, మెట్‌పల్లి,(రాధారపు నర్సయ్య):** మెట్‌పల్లి బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద ఉన్న పురాతన హనుమాన్ దేవాలయం చుట్టూ నెలకొన్న వివాదం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. ఆలయ గోడలు దెబ్బతినడంతో భక్తులు స్వచ్ఛందంగా చేపట్టిన పునర్నిర్మాణ పనులను ఆర్టీసీ అధికారులు అడ్డుకోవడమే కాకుండా, విగ్రహాన్ని తొలగించేందుకు ప్రయత్నించడం స్థానికంగా కలకలం రేపింది.

- తొలగింపు యత్నాలు.. భక్తుల తీవ్ర ఆగ్రహం.. ధర్నాతో దద్దరిల్లిన డిపో
- విగ్రహం పునఃప్రతిష్ఠతో శాంతించిన వాతావరణం.. అండగా నిలిచిన సురభి నవీన్ కుమార్

**మళ్ళీ మొదటికే.. ఎంపీ హెచ్చరికలు బేఖాతర్**

ఈ వివాదం కొత్తదేమీ కాదు. గత మార్చి 6న ఇలాగే గద్దెలను కూల్చే ప్రయత్నం చేయగా, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ రంగంలోకి దిగి అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. 'మీ పని బస్సులు నడపడం మాత్రమే.. ఇలాంటి చర్యలకు పాల్పడవద్దు' అని స్పష్టం చేసినా, మళ్ళీ తాజాగా అధికారులు విగ్రహం తొలగింపునకు పూనుకోవడంపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**భక్తుల పట్టుదల.. అధికారుల దిగిబాటు**

తాజా పరిణామాలతో హనుమాన్ మాలధారులు, భక్తులు బస్టాండ్ గేటు వద్దే బైఠాయించి ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని భక్తులకు మద్దతు తెలిపారు. అధికారులతో జరిపిన చర్చలు ఫలించడంతో, భక్తుల పట్టుదలకు తలొగ్గిన అధికారులు విగ్రహాన్ని యథాస్థానంలో పునఃప్రతిష్ఠించేందుకు అంగీకరించారు. దీంతో భక్తులు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆందోళన విరమించారు. ప్రస్తుతం పోలీసులు అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

